RNI Reg-No. APTEL/2002/07373

Postal Registration No.VJ/215/2025-27


# నేటి మనదేశం

NETIMANADESAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

Simultaneously published from Vijayawada, Visakhapatnam, Tirupati & Hyderabad

## ఏపీ ఈఏపీసెట్-2026 ఫలితాల విడుదల వాయిదా




అమరావతి, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్‌లో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో మిగతా 2లో..

సంపుటి :24 Vol. No.24 సంచిక : 183 Issue No. 183 విజయవాడ Vijayawada సంపాదకులు: కె.ఎస్.రంగశాయి: బుధవారం 01-07-2026 Wednesday, July 01 2026 పేజీలు : 8 Pages: 8 వెల: రూ.1-00 Price Rs.1-00



# ఖనిజ నిల్వలపై మినరల్ మ్యాపింగ్

- ఖనిజాలకు విలువ జోడింపుపై ప్రత్యేక దృష్టి
- మినరల్ వెల్త్ మార్కెట్ క్యాపిటలైజేషన్‌పై అధ్యయనం
- టెక్నాలజీ వినియోగంతో ఉచిత ఇసుక తవ్వకాల పర్యవేక్షణ
- గనుల శాఖపై సమీక్ష లో ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో విలువైన ఖనిజ నిల్వల్ని గుర్తించేలా మినరల్ మ్యాపింగ్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. క్రిటికల్ మినరల్స్, బల్క్ మినరల్స్‌తో పాటు విలువైన లోహాలు లభ్యం అయ్యే ప్రాంతాల మ్యాపింగ్ జరగాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వెలికి తీసే ఖనిజాలకు విలువ జోడించేలా ప్రాసెసింగ్ పక్రియను నిర్వహించే అంశంపైనా దృష్టి సారించాలని సూచించారు. క్యాంపు కార్యాలయంలో గనుల శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని ఖనిజ సంపదకు సంబంధించి మిగతా 2లో..

# మహా సిఎం ఫడ్నవీస్‌తో పవన్ భేటీ

తూర్పు కనుమలలో పులుల సంరక్షణపై చర్చ

రెండు ఆడపులులను ఇచ్చేందుకు సిఎం అంగీకారం



**ముంబయి, జూన్ 30 (ఆర్ఎన్ఎ):** మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌తో ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. ఇరు రాష్ట్రాల మధ్య పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన ముఖ్యమైన అంశాలపై నేతలు చర్చించారు. ముంబయిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఈ భేటీ జరిగింది. తూర్పు కనుమల్లో పులుల సంరక్షణ, మహారాష్ట్ర నుంచి రాష్ట్రానికి రెండు ఆడ పులులు ఇచ్చే అంశాలపై చర్చలు సాగాయి. ఉమ్మడి ప్రయోజనాలకు సంబంధించి భవిష్యత్తులో మరింత సహకరించుకోవాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు కనుమల ప్రాంతంలో ఆడ పులుల మిగతా 2లో..

# దేశ నిర్మాణంలో యువతదే కీలక భూమిక

మనం అభివృద్ధి చెందడమే కాదు.. వెనక ఉన్నవారిని ముందుకు తీసుకెళ్లాలి

గిరిజన వర్సిటీ తొలి స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



**విశాఖపట్నం, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** దేశ నిర్మాణంలో విద్యావంతులైన యువతదే అత్యంత కీలక భూమిక అని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పష్టం చేశారు. మంగళవారం విశాఖపట్నంలోని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకకు రాష్ట్రపతి ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ.. 'నేను కూడా ఒక మారుమూల గ్రామం నుంచి వచ్చిన మొదటి గ్రాడ్యుయేట్‌ను. ఈరోజు ఇంతమంది యువతీయువకులకు పట్టాలు అందించడం నాకు మిగతా 2లో..

# మామిడిరైతులు ఆందోళన చెందవద్దు

ఈయేడు కూడా కేజీకి రూ.4 చెల్లిస్తున్నాం

మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హామీ



**అమరావతి, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మామిడి రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చిత్తూరు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. వారికి అండగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. గత ఏడాది కూడా కూటమి ప్రభుత్వం రైతులకు కేజీకి రూ.4 చెల్లించి అండగా నిలిచిందని గుర్తుచేశారు. ఈ ఏడాది కూడా కేజీకి రూ.4 ముందస్తు చెల్లించి మామిడి కొనుగోళ్లు కొనసాగిస్తున్నామని తెలిపారు. పంట దిగుబడి అధికంగా రావడంతో తాత్కాలికంగా కొనుగోళ్లపై ఒత్తిడి ఏర్పడిందని చెప్పారు. గత ఏడాది మామిడి రైతులకు సుమారు రూ.190 కోట్లు చెల్లించి ప్రభుత్వం ఆదుకుందన్నారు. రైతులకు మిగతా 2లో..

# భారత నూతన ఆర్మీ చీఫ్‌గా ధీరజ్ సేథ్

పదవీ బాధ్యతలు స్వీకరించిన జనరల్ ధీరజ్



**న్యూఢిల్లీ, జూన్ 30 (ఆర్ఎన్ఎ):** భారత సైన్యానికి నూతన అధిపతిగా జనరల్ ధీరజ్ సేథ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. దేశ 31వ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. జనరల్ ఉపేంద్ర ద్వివేది స్థానంలో.. కొత్త ఆర్మీ చీఫ్ కమాండ్ చేపట్టారు. ఆర్మోర్డ్ కార్ప్స్ విభాగం నుంచి ఆర్మీ చీఫ్ పదవిని అధిష్ఠించిన 7వ అధికారిగా ధీరజ్ సేథ్ రికార్డు సృష్టించారు. సౌత్ బ్లాక్ లాన్స్‌లో సైనిక సంప్రదాయాల మధ్య అధికారికంగా కొత్త ఆర్మీ చీఫ్ మిగతా 2లో..

# పారిశ్రామిక రంగంలో ఎపి ఊహించని ప్రగతి

స్పేస్, డ్రోన్ సిటీల నుంచి గ్రీన్ హైడ్రోజన్ వరకూ పురోగతి

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్



**అమరావతి, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** స్పేస్, డ్రోన్ సిటీల నుంచి గ్రీన్ హైడ్రోజన్ వరకూ ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో ఊహించని ప్రగతిని సాధించిందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. గత ఐదేళ్ల పాలనతో పోలిస్తే కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ రెండేళ్ల కాలంలో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో అద్భుతమైన ప్రగతి సాధించిందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ స్పష్టం చేశారు. అమరావతిలో జరిగిన ఒక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2019 నుంచి 2024 వరకు ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల సంఖ్య పూర్తిగా పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పారిశ్రామిక విధానాల్లో మిగతా 2లో..

# కారును వేగంగా ఢీకొన్న కంటెయినర్


- అదే వేగంతో ముందున్న ట్యాంకర్‌ను ఢీకొన్న కారు
- రెండు వాహనాల మధ్య నుజ్జునుజ్జు అయిన కారు
- చిన్నారి సహా ఇద్దరు మృతి



**విజయవాడ, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కృష్ణా జిల్లాలోని బీబీగూడెం వద్ద ఉన్న పశ్చిమ బైపాస్ రోడ్డులో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా దూసుకొచ్చిన కంటైనర్.. కారును వెనక నుంచి ఢీకొట్టడంతో.. ముందున్న ట్యాంకర్‌ను ఆ కారు బలంగా ఢీకొట్టింది. ఈ క్రమంలో కంటైనర్, ట్యాంకర్ మధ్యలో కారు నుజ్జునుజ్జయ్యింది. ఈ ప్రమాదంలో కారులో మిగతా 2లో..

# మహిళా పారిశ్రామికవేత్తలకు అండగా ఎపి టాప్

రూ.1,495.50 కోట్ల రుణాల పంపిణీ



**అమరావతి, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** డ్వాక్రా మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడంలో విశేషంగా కృషి చేస్తోన్న రాష్ట్ర ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరంలో మహిళలకు వ్యక్తిగత ఎంటర్‌ప్రైజ్ రుణాల అమల్లో 99.7 శాతం లక్ష్యాన్ని సాధించింది. రూ.1,500 కోట్ల రుణ లక్ష్యానికి గాను రూ.1,495.50 కోట్ల రుణాలను మహిళా పారిశ్రామిక వేత్తలకు పంపిణీ చేసింది. 1.50 లక్షల మంది మహిళలకు రుణాల అందించాలని లక్ష్యం పెట్టుకోగా, 1,47,840 మందికి వ్యక్తిగత పారిశ్రామిక రుణాలు అందించింది. ఎపీతో సమానంగా లక్ష్యాలను నిర్దేశించు కుని... టార్గెటులో కేవలం 15, 25 శాతం మాత్రమే బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు చేరుకున్నాయి. మహిళా పారిశ్రామిక వేత్తలకు ఎపి ప్రభుత్వం రుణాలు అందించడంలో అద్భుత పనితీరు కనబరుస్తుండ డంతో 2026-27 ఏడాదికి ఏపీకి 1.67 లక్షల మంది మహిళలకు రూ. 1670 కోట్లు రుణాలు అందించాలని టార్గెట్‌గా పెట్టుకుంది. ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ పథకంలోనూ దేశంలో అగ్రస్థానంలో ఆంధ్రప్రదేశ్ నిలిచింది. మహిళల ఆర్థిక సాధికారతలో ఆంధ్రప్రదేశ్ దేశానికి ఆదర్శంగా నిలిచిందని కేంద్ర నివేదికలు చెబుతున్నాయి. 2025-26లో 35,934 మంది లబ్ధిదారులకు ప్రయోజనం మిగతా 2లో..

# బైక్‌ను ఢీకొన్న బొలెరో వాహనం

ప్రమాదంతో తల్లి మృతి..కొడుకు గాయాలు

**హైదరాబాద్, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నగరంలోని దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో విషాదం నెలకొంది. కన్న కొడుకు కళ్ల ముందే తల్లి దుర్మరణం చెందింది. మంగళవారం ఉదయం బహుదూర్ పల్లి గ్రామం మెయిన్ రోడ్‌పై మద్యం మత్తులో బొలెరో డ్రైవర్ బీభత్సం సృష్టించాడు. బైక్‌పై వెళ్తున్న తల్లీకొడుకును బొలెరో వాహనం వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తల్లి ఉదయ్ లతారెడ్డి(49) అక్కడికక్కడే మృతిచెందగా.. కొడుకు వేదాంత్ రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని గాయపడిన వేదాంత్‌ను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. అలాగే లతారెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మద్యం మత్తులో వాహనం నడిపిన డ్రైవర్‌పై కేసు నమోదు అయ్యింది.

మొదటి పేజీ తరువాయిలు

## ఏపీ ఈఏపీసెట్-2026 ఫలితాల విడుదల వాయిదా

ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్-2026 ఫలితాల విడుదలను రాష్ట్ర ప్రభుత్వం వాయిదా వేసింది. సీబీఎస్సీ 12వ తరగతి ఫలితాలు పూర్తిస్థాయిలో రానందున, విద్యార్థుల అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం జూన్ 1న ఫలితాలను విడుదల చేయాల్సి ఉండగా, ఇంటర్మీడియట్ మార్కులకు 25 శాతం వెయిటేజ్ ఉండటంతో ఏ ఒక్క విద్యార్థికీ నష్టం జరగకుండా జాగ్రత్త పడాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీబీఎస్సీ రివైజ్డ్ ఫలితాలు, అలాగే ఇంటర్ ద్వితీయ సంవత్సరం అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు వచ్చిన అనంతరం ఈఏపీసెట్ ఫలితాలను విడుదల చేయనున్నారు. ఏడాది మే 12 నుంచి 20 వరకు నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 3.29 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. తాజా నిర్ణయం ప్రకారం జులై 2 వరకు ఈఏపీసెట్ ఫలితాల విడుదల వాయిదా పడింది.

## మహా సిఎం ఫడ్నవీస్‌తో పవన్ భేటీ

సంఖ్య గణనీయంగా తగ్గడంతో జన్యుపరమైన సమస్యలు తలెత్తాయన్నారు. ఈ క్రమంలో పులుల సంఖ్య పునరుద్ధరణకు మహారాష్ట్ర ప్రభుత్వ సహకారం తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు రెండు ఆడ పులులు ఇచ్చేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని.. ఈ సహకారానికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. తూర్పు కనుమలలో పులుల సంరక్షణ చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. ఏపీలోని తూర్పు కనుమల ప్రాంతంలో ఆడపులుల సంఖ్య గణనీయంగా తగ్గడంతో జన్యుపరమైన సమస్యలు వచ్చాయని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో పులుల సంఖ్య పునరుద్ధరణకు మహారాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు రెండు ఆడపులులను ఇచ్చేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు.

## భారత నూతన ఆర్మీ చీఫ్‌గా ధీరజ్ సేథ్

బాధ్యతలు స్వీకరించారు. 1986లో ఆర్మోర్డ్ కార్ప్స్‌లో కమిషన్డ్ అధికారిగా జనరల్ ధీరజ్ సేథ్ ప్రస్థానం ప్రారంభించారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద నిరోధక దళానికి కమాండర్‌గా పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఆయనకు ఉంది. సైన్యంలో కీలకమైన సదరన్ కమాండ్, సౌత్ వెస్టర్న్ కమాండ్.. రెండింటికీ ఆర్మీ కమాండర్‌గా ధీరజ్ సేథ్ వ్యవహరించారు. రక్షణ విభాగంలో ప్లానింగ్, కేపబిలిటీ డెవలప్‌మెంట్‌లో విశేష అనుభవం.. సైన్యం ఆధునికీకరణపై ప్రత్యేక దృష్టి సారించారు.

## మామిడిరైతులు ఆందోళన చెందవద్దు

ఎలాంటి నష్టం జరగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. కొనుగోళ్లలో జాప్యం జరిగితే సంబంధిత ఫ్యాక్టరీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సంబంధించిన వైసీపీ సానుభూతి కంపెనీలు కొనుగోళ్లలో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించమన్నారు. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేశారు. రైతులను వైసీపీ.. రాజకీయాలకు వాడుకోవడం మానుకోవాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హెచ్చరించారు.

## మహిళా పారిశ్రామికవేత్తలకు అండగా ఎపి టాప్

కల్పించిన రాష్ట్రం. 2025-26 ఏడాదిలో నిర్దేశించుకున్న లక్ష్యంలో 95 శాతం సాధించింది. రుణాల పంపిణీతోపాటు గ్రామీణ మహిళలకు స్థిరమైన ఉపాధి కల్పించడంలోనూ ముందంజలో ఉంది. వ్యాపార నిర్వహణ, ఫైనాన్షియల్-డిజిటల్ లిటరసీ, నైపుణ్యాభివృద్ధిపై డ్వాక్రా మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇప్పించచింది. అలాగే డిజిటల్ మానిటరింగ్, ఎంఐఎస్ వ్యవస్థ, ఫీల్డ్ తనిఖీలతో మహిళా పారిశ్రామిక వేత్తలకు రుణాల మంజూరు చేయించే అంశంపై కూటమి ప్రభుత్వ నిరంతర పర్యవేక్షణ చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా వేగంగా రుణాలు మంజూరు చేసి మహిళలకు తోడ్పాటు అందించాయి బ్యాంకులు. ఆత్మనిర్భర్ భారత్, వోకల్ ఫర్ లోకల్ లక్ష్యాల సాధనలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉండగా గ్రామీణ పారిశ్రామికీకరణ, మహిళా సాధికారత, ఉపాధి కల్పన, కుటుంబ ఆదాయాల పెంపులో ఏపీ ఆదర్శంగా నిలిచింది. పేద, వెనుకబడిన వర్గాల మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడంలో జాతీయ స్థాయిలో ఛాంపియన్ గా నిలిచింది ఆంధ్రప్రదేశ్.

## కారును వేగంగా ఢీకొన్న కంటెయినర్

ఉన్న ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో నాలుగేళ్ల చిన్నారి చనిపోవడం తీవ్రంగా కలిచివేసింది. ఇదే ప్రమాదంలో ఎదురుగా వెళ్తున్న బైక్‌ను కూడా ట్యాంకర్ బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి కూడా దుర్మరణం చెందాడు. ప్రమాదం జరిగిన తీరు చూసి స్థానికులు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. కంటైనర్, ట్యాంకర్‌కు మధ్యలో కారు నామరూపాలు లేకుండాపోయింది. మృతదేహాలు కారు లోపలే ఇరుక్కుపోయిన పరిస్థితి. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని పొక్లెయినర్ సాయంతో కారును బయటకు తీసి.. అందులో నుంచి మృతదేహాలను వెలికితీశారు. ఈ ప్రమాదంపై గన్నవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కంటైనర్ డ్రైవర్ అతివేగంగా వచ్చి ఢీకొట్టడం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

# ఖనిజ నిల్వలపై మినరల్ మ్యాపింగ్

(మొదటి పేజీ తరువాయి)

మార్కెట్ క్యాపిటలైజేషన్ కు విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని అన్నారు. రాష్ట్రప్రభుత్వ రంగ సంస్థ ఏపీఎండీసీ ద్వారా విలువైన ఖనిజాల మార్కెట్ క్యాపిటలైజేషన్‌కు అవకాశం ఉందన్నారు. దీనిపై నిపుణులతో కలిసి అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. బీచ్ శాండ్, రేర్ ఎర్త్ మినరల్స్, ముడి ఇనుము, మాంగనీస్, అల్యూమినా లాంటి వివిధ ఖనిజాలకు విలువ జోడింపు పక్రియ ద్వారా గరిష్టంగా రెవెన్యూను ఆర్జించేందుకు ఆస్కారం ఉందని సీఎం అన్నారు. దేశంలోని కొన్ని రాష్ట్రాలు ఖనిజ ఆదాయం కారణంగానే రెవెన్యూ మిగులు సాధించాయని సీఎం వ్యాఖ్యానించారు. ఖనిజాల వ్యాల్యూ అడిషన్ కు సంబంధించి విస్తృతంగా చర్చించి ఓ ప్రత్యేక విధానం తీసుకువచ్చే అంశాన్ని పరిశీలించాలన్నారు. రాష్ట్రంలోనే ఈ ఖనిజాల విలువ జోడింపు పక్రియ జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఏపీ, ఒడిశా, కేరళ లాంటి రాష్ట్రాల్లో లభ్యమయ్యే అత్యంత విలువైన రేర్ ఎర్త్ మినరల్స్‌పై క్లస్టర్ ఏర్పాటు చేయాలని సూచించారు. టైటానియం, ఇలమనైట్, మోనజైట్ లాంటి హై వాల్యూ మినరల్స్ నిల్వలు ఏమేరకు ఉన్నాయన్న దానిని గుర్తించాలన్నారు. ఎలక్ట్రానిక్స్, మాగ్నెట్స్ సహా విలువైన లోహాలను తయారు చేసేందుకు రేర్ ఎర్త్ మినరల్స్ వెలికితీత జరగాలన్నారు. ప్రత్యేకమైన పరికరాల తయారీకి కీలకమైన



ఈ లోహాలు అణు ఇంధనం సహా వ్యూహాత్మకంగా దేశానికి కూడా అత్యంత కీలకమని సీఎం అన్నారు. రాష్ట్రంలో జొన్నగిరి సహా చిత్తూరు జిల్లా చిగురుగుంట వద్ద కూడా బంగారం నిల్వలు ఉన్నాయని మిగతా బ్లాక్స్ పై కూడా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి గనుల శాఖకు సూచనలిచ్చారు. రాష్ట్రంలోని 126 ప్రాంతాల్లో క్రిటికల్, బల్క్ ఖనిజాలు సహా ఇతర విలువైన ఖనిజాలను గుర్తించామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రస్తుతం మైనింగ్ ఆపరేషన్స్ ద్వారా రెవెన్యూలో 18 శాతం మేర వృద్ధి నమోదైనట్టు తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం గనుల తవ్వకాలను కట్టుదిట్టంగా నిర్వహించాలని ఆదేశించారు. ఖనిజ సంపద ద్వారా రాష్ట్రానికి గరిష్ట ఆదాయం వచ్చేలా చూడాలని సూచించారు. ఇసుక తవ్వకాల, సరఫరా పై కూడా పూర్తి స్థాయి నిఘా ఉంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇసుక రీచ్ ల వద్ద సీసీ కెమెరాలతో పాటు శాటిలైట్ చిత్రాల ద్వారా విశ్లేషించటంతో పాటు వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రజల కోసమే ఇసుకపై వెయ్యి కోట్ల రూపాయల మేర ఆదాయాన్ని వదిలేసి ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని అన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఈ సమిక్షలో గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, సీఎస్ సాయి ప్రసాద్, గనుల శాఖ, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శులు ముఖేష్ కుమార్ మీనా, పీయుష్ కుమార్ సహా ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పారిశ్రామిక రంగంలో ఎపి ఊహించని ప్రగతి

(మొదటి పేజీ తరువాయి)

తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పుల వల్ల గడిచిన రెండేళ్లలోనే ఏకంగా రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయన్నారు. దేశవ్యాప్తంగా వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో కేవలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే 24.3 శాతం వాటాను దక్కించుకొని దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని మంత్రి గర్వంగా ప్రకటించారు. రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడి ప్రతిపాదనలను వేగంగా కార్యరూపంలోకి తీసుకురావడానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని మంత్రి టీజీ భరత్ వివరించారు. ఇందులో భాగంగా నిర్వహించిన 18 ఎస్ఐపీబీ సమావేశాల్లోనే దాదాపు రూ.11.77 లక్షల కోట్ల పెట్టుబడు లకు లైన్ క్లియర్ చేస్తూ అనుమతులు మంజూరు చేశామని తెలిపారు. ఈ భారీ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్ర యువతకు పది లక్షల ముప్పై రెండు వేల (10.32 లక్షలు) కొత్త ఉద్యోగ అవకాశాలు రానున్నాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పరిశ్రమల స్థాపనకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడంలో భాగంగా ప్రభుత్వం ఇప్పటివరకు వివిధ శాఖల ద్వారా 26 నూతన విధానాలను ప్రకటించగా, అందులో పరిశ్రమల శాఖే స్వయంగా 6 కీలక పాలసీలను తీసుకొచ్చిందని గుర్తుచేశారు. క్వాంటం వ్యాలీ, ప్రతిష్టాత్మక స్టీల్ ఎ÷-లాంట్, స్పేస్, డ్రోన్ సిటీ, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీతో పాటు సర్క్యులర్ ఎకానమీ పాలసీలపై ప్రభుత్వం పూర్తి స్థాయిలో దృష్టి సారించిందన్నారు.

# దేశ నిర్మాణంలో యువతదే కీలక భూమిక

(మొదటి పేజీ తరువాయి)

ఎంతో సంతోషాన్నిస్తోందని భావోద్వేగంగా పేర్కొన్నారు. ఉన్నత శిఖరాలను అధిరోహించే క్రమంలో సమాజంలో ఇంకా వెనుకబడి ఉన్న అట్టడుగు వర్గాలను మరవకూడదని ఆమె విద్యార్థులకు హితవు పలికారు. 'మీరు జీవితంలో ముందుకు వెళ్లడమే కాదు.. ఒక్కసారి వెనక్కి తిరిగి చూస్తే అభివృద్ధి కోసం ఎదురుచూస్తున్న ఎందరో పేదలు, అట్టడుగు వర్గాల వారు కనిపిస్తారు. వారిని ప్రోత్సహించడంలో మీ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. 'వికసిత్ భారత్' లక్ష్య సాధన దిశగా యువత పాత్ర ఎంతో కీలకమని, దేశ మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం లాంటి మహానుభావుల జీవితాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని ద్రౌపది ముర్ము ఆకాంక్షించారు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే అసలైన విద్య అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. నాణ్యమైన విద్య సమాజంలోని ప్రతి వర్గానికి చేరాలని ఆకాంక్షించారు. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందితేనే వికసిత్ భారత్ కల సాకారం అవుతుందన్నారు. స్వయంకృషితో రాష్ట్రపతిగా ఎదిగిన వ్యక్తి ద్రౌపది ముర్ము అని కొనియాడారు. విద్యార్థులను భవిష్యత్తు నాయకులుగా తీర్చిదిద్దుతామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా13 మందికి రాష్ట్రపతి బంగారు పతకాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్, మంత్రి సంధ్యారాణి, ట్రైబల్ యూనివర్సిటీ ఛాన్సలర్, వీసీ పాల్గొన్నారు.

# మెడికవర్ హాస్పిటల్స్ లో నూతన డయాలిసిస్ విభాగం ప్రారంభం

**నూతన మెషిన్స్‌ను మరియు నాలెడ్జ్ స్టూడియో విభాగాన్ని ప్రారంభించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్**



**కాకినాడ, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మెడికవర్ హాస్పిటల్స్, కాకినాడలో నూతనంగా ఏర్పాటు చేసిన డయాలిసిస్ విభాగాన్ని బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ, మెడికవర్ హాస్పిటల్స్ కాకినాడ ప్రజలకు నాణ్యమైన మరియు ఆధునిక వైద్య సేవలను అందిస్తూ విశ్వాసాన్ని సంపాదించుకుందని అన్నారు. ముఖ్యంగా ట్రాన్స్‌ప్లాంట్ సేవలు, అరుదైన వ్యాధులకు చికిత్సలు మరియు అత్యాధునిక వైద్య సదుపాయాలను తక్కువ ఖర్చుతో అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా అత్యంత వేగంగా వైద్య సేవలను విస్తరిస్తున్న సంస్థగా మెడికవర్ హాస్పిటల్స్ గ్రూప్ ముందంజలో ఉందని తెలిపారు. ప్రజలకు అందుబాటు ధరల్లో మెరుగైన వైద్య సేవలను అందించడం ద్వారా ఆరోగ్య రంగంలో ప్రత్యేక గుర్తింపు సాధించిందని కొనియాడారు. కాకినాడ జిల్లా ప్రజలకు డా. ఎన్టీఆర్ వైద్య సేవ మరియు ఆయుష్మాన్ భారత్ పథకాల ద్వారా నాణ్యమైన వైద్య సేవలను అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సామాన్య ప్రజలకు కూడా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుబాటులోకి రావడం సంతోషకరమని అన్నారు. నూతన డయాలిసిస్ విభాగం ద్వారా కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న రోగులకు మరింత మెరుగైన చికిత్స అందుతుందని, మెరుగైన క్యాన్సర్ వైద్య సేవలు, గుండె సంబంధిత మరియు మెదడు మరియు వెన్నుముక సంబంధిత వైద్య సేవలు, అన్ని సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులో ఉండటం స్థానిక ప్రజలకు ఇది ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్ కాకినాడ సెంటర్ హెడ్ నందికోళ్ల. అంజిబాబు మాట్లాడుతూ, ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందించడమే మెడికవర్ హాస్పిటల్స్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముఖ్యంగా కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న రోగులకు నాణ్యమైన డయాలిసిస్ సేవలను అందించేందుకు నూతన డయాలిసిస్ విభాగాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. డా. ఎన్టీఆర్ వైద్య సేవ మరియు ఆయుష్మాన్ భారత్ పథకాల ద్వారా సామాన్య ప్రజలకు కూడా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ప్రత్యేక వైద్య విభాగాలను ప్రారంభించి, కాకినాడ మరియు పరిసర ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వర రావు,బీజేపీ ప్రతినిది నాని ,మెడికవర్ హాస్పిటల్స్ యాజమాన్యం, వైద్యులు, సిబ్బంది మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# ఐపిఎస్ అధికారి సునీల్‌కు క్యాట్‌లో చుక్కెదురు

**సస్పెన్షన్ ఎత్తేయాలన్న పిటిషన్ కొట్టివేత**

**న్యూఢిల్లీ,జూన్ 30(ఆర్ఎన్ఎ):** ఏపీకి చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్ కు సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రైబ్యునల్ (క్యాట్)లో చుక్కెదురైంది. తనపై రాష్ట్ర ప్రభుత్వం విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను క్యాట్ కొట్టివేసింది. తీవ్ర అవినీతి ఆరోపణలతో సస్పెన్షన్‌లో ఉన్న సునీల్‌కుమార్ నేడు సర్వీస్ నుంచి రిలీవ్ అయ్యేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఈరోజైనా తనకు రిలీఫ్ ఇవ్వాలని సునీల్ కుమార్ క్యాట్‌ను కోరారు. మంగళవారం ఉదయం జరిగిన విచారణలో సునీల్ వాదనలు విన్న క్యాట్.. సస్పెన్షన్ రద్దు చేయాలన్న అభ్యర్థనను తోసిపుచ్చింది. సునీల్ కుమార్‌పై పెండింగ్‌లో ఉన్న క్రమశిక్షణ, నేర విచారణలకు ఎలాంటి మినహాయింపులు లేవని, అవి కొనసాగుతాయని మంగళవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆయనకు లభించాల్సిన పెన్షన్ ప్రయోజనాలు అఖిల భారత సర్వీసుల నియమాల ప్రకారం కేంద్ర ప్రభుత్వం జారీ చేసే ఆదేశాలకు లోబడి ఉంటాయని పేర్కొంది.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంద్ర ప్రసాద్**



**కాకినాడ, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంద్ర ప్రసాద్ బీఎల్‌వోలకు స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మంగళవారం కాకినాడ నగరంలోని శాంతినగర్ ప్రాంతంలో ఉన్న 48వ పోలింగ్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటింటికీ నిర్వహిస్తున్న ఓటరు వివరాల ధృవీకరణ, నమోదు ప్రక్రియ, దరఖాస్తుల స్వీకరణ, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం మరియు ఉన్నతాధికారులు జారీ చేస్తున్న మార్గదర్శకాలను బీఎల్‌వోలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రతి ఓటరుకు న్యాయం జరిగేలా పారదర్శకంగా విధులు నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లు లేదా నిర్లక్ష్యానికి తావివ్వకూడదన్నారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట కాకినాడ అర్బన్ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్ఓ) కె.టి. సుధాకర్, సహాయ ఎన్నికల నమోదు అధికారి (ఏఈఆర్ఓ) మరియు అర్బన్ తహసీల్దార్ జితేంద్ర, ఎన్నికల డిప్యూటీ తాసిల్దార్ గోవిందరాజులు,తదితర అధికారులు పాల్గొన్నారు.

# రైతు ఉద్యమాలకు దిశా నిర్దేశం

- జులై 3,4,5 తేదీల్లో ఏలూరు వేదికగా రైతు మహాసభలు
- వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే విధానాలు అవసరం
- నష్టపోతున్న అన్ని పంటల రైతులను ఆదుకోవాలి
- రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి




**ఏలూరు, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్ర రైతుల ఉద్యమాలకు జులై 3,4,5 తేదీల్లో ఏలూరులో జరగనున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర 23వ మహాసభలు దిశా నిర్దేశం చేయనున్నాయని, ఈ మహాసభ నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి చెప్పారు. మంగళవారం ఏలూరులోని అల్లూరు సత్యనారాయణ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జులై 3న మధ్యాహ్నం గంటలకు జూట్ మిల్ సెంటర్ నుండి హాలో రైతన్న - చలో ఏలూరు పేరుతో రైతు మహా ప్రదర్శన, మధ్యాహ్నం 3 గంటలకు ఇండోర్ స్టేడియం గ్రౌండ్ లో బహిరంగ సభ జరుగుతుందని, 4,5 తేదీల్లో డీసీఎంఎస్ ఫంక్షన్ హాలులో ప్రతినిధుల సభ జరుగుతుందని వివరించారు. ముఖ్య అతిథులుగా అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షులు అశోక్ ధావలే, జాతీయ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్, జాతీయ సహాయ కార్యదర్శి టి.సాగర్, రైతు సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు తదితర ప్రముఖులు హాజరుకానున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని రైతాంగ సమస్యలపై చర్చించి తీర్మానాలు చేయనున్నామన్నారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి బాగాలేదని, ఏ పంటకు కనీస ధర రావడం లేదన్నారు. మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారని, మామిడికి తగిన ధర రాలేదని, పొగాకు రైతులకు పొగ పెడుతున్నారని విమర్శించారు. ఆక్వా రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని, రో÷-లడెక్కి ఆందోళన చేయాల్సిన పరిస్థితిని ప్రభుత్వాలు కల్పించాయన్నారు. భారీగా పెంచిన ఆక్వా మేతల ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆక్వా రైతుల ఆందోళనకు సంఘీభావం ప్రకటించారు. వర్జీనియా పొగాకు కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1000 కోట్లు కేటాయించాలని కోరారు. పొగాకు కొనుగోలు వేగవంతం చేయాలన్నారు. కోకో రైతులకు తగిన ధర రాలేదని, కోకో గింజలకు ప్రైస్ పాలసీ ప్రకటించాలన్నారు.ఆయిల్ పామ్ రైతులను ఆయిల్ రికవరీ శాతం పేరుతో కంపెనీల దోపిడీ ఆపాలన్నారు. అమెరికాతో భారత్ జులై మొదటి వారంలో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేయనున్నట్లు ప్రకటించారని, ఈ ఒప్పందం వలన మన దేశ వ్యవసారంగం తీవ్రంగా దెబ్బతింటుందని, రైతులు నష్టపోతారని ఆందోళన చేశారు. పాలు,పాల పదార్థాలు ఎటువంటి సుంకాలు లేకుండా దిగుమతి అవుతాయని, పాడి పరిశ్రమ,పాడి రైతులు దివాళా తీస్తారని చెప్పారు. మొక్కజొన్న,సోయాబీన్,పత్తి ఇతర వ్యవసాయ ఉత్పత్తులు దిగుమతి అయితే ఇప్పటికే నష్టపోతున్న ఆయా పంటల రైతులు మరింత నష్టపోతారని అన్నారు. అమెరికాతో స్వేచ్ఛా ఒప్పందాన్ని అందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. వ్యవసాయంలో స్థితిగతులు చర్చించి భవిష్యత్ రైతు ఉద్యమాలకు దిశా నిర్దేశర చేయనున్న రైతు సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని అందుకు అందరూ సహకరించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర పూర్వ అధ్యక్షులు బి. బలరాం మాట్లాడుతూ రైతు రక్షణ,వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కృషి చేస్తోందన్నారు. వ్యవసాయంలో కీలకపాత్ర వహిస్తున్న కౌలు రైతుల పట్ల ప్రభుత్వాలు చిన్న చూపు చూస్తున్నాయని విమర్శించారు. కౌలు రైతుల రక్షణ కోసం నూతన చట్టం తేవాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. శ్రీనివాస్ మాట్లాడుతూ రైతు సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం నాయకులు ఆర్.లింగరాజు, ఎం. నాగమణి, పి.రామకృష్ణ, డి.ఎన్.వి.డి ప్రసాద్, జి.రాజు తదితరులు పాల్గొన్నారు.

## నేటి మనదేశం సంపాదకీయం

# మనం పౌరులమన్న దానికి గుర్తింపు ఏదీ?

ఇప్పుడు పౌరసత్వానికి గుర్తింపు ఏంటన్న చర్చ జోరుగా సాగుతోంది. పాస్‌పోర్టు కాదన్నారు. ఆధార్ కూడా కాదన్నారు. ఓటరు ఐడి అంతకన్న కాదన్నారు. మరి ఏది మనలను భారతీయులు అని గుర్తించడానికి అన్నది..? దీనికి సమాధానం కనిపించడం లేదు. కాదన్నవారు చెప్పడం లేదు. సర్ ప్రక్రియ సాగుతున్న వేళ దీనిపై పెద్ద దుమారమే లేచింది. పాస్‌పోర్ట్ కూడా కాదన్నప్పుడు ఏది అన్న ప్రశ్న సహజంగానే వస్తోంది. అసలు మన దేశంలో పౌరసత్వాన్ని ఎలా గుర్తిస్తారు? రాజ్యాంగం ఏం చెబుతోంది? పాస్‌పోర్ట్ పౌరసత్వ ధృవీకరణ పత్రం కాకపోతే.. అసలైన గుర్తింపు ఏది? ఎవరు భారతీయులో తేల్చేది ఎవరు వంటి సందేహాలు ఇప్పుడు సామాన్యుల మదిని తొలుస్తున్నాయి. విదేశీ వ్యవహారాల శాఖ ఏం చెప్పింది..మన దేశంలో చాలా మందికి పాస్‌పోర్ట్ ఉంటే అదే అసలైన పౌరసత్వ గుర్తింపు అని ఓ బలమైన నమ్మకం ఉంది. ఎవరైనా విదేశాలకు వెళ్లాలన్నా గుర్తింపు కార్డుగా చూపించాలన్నా అందరికీ ముందుగా గుర్తొచ్చేది పాస్‌పోర్టే. అయితే విదేశీ వ్యవహారాల శాఖ నుంచి వచ్చిన ఓ ప్రకటన ఇప్పుడు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పాస్‌పోర్ట్ కేవలం ప్రయాణ పత్రం మాత్రమేనని.. అది పౌరసత్వానికి నిదర్శనం కాదని ఇటీవల తేల్చి చెప్పింది. ఆధార్ కూడా కేవలం గుర్తింపు కార్డు మాత్రమేనని గతంలోనే తేల్చారు. ఇన్ని ప్రశ్నల మధ్య అసలు ఏంటన్నది కేంద్రమే తేల్చాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వంపైనే ఈ బాధ్యత ఉంది. పాస్‌పోర్ట్ సేవా దివస్ సందర్భంగా విదేశీ వ్యవహారాల శాఖ చేసిన ప్రకటన ఇప్పుడు దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు దారితీసింది. భారతీయులకు పాస్‌పోర్ట్ కేవలం ఒక ట్రావెల్ డాక్యుమెంట్ మాత్రమేనని స్పష్టం చేసింది. ప్రభుత్వ అధికారుల పటిష్టమైన విచారణ తర్వాతే పౌరులకు దీన్ని జారీ చేస్తారు. భారత రిపబ్లిక్ పేరుతో జారీ అయ్యే ఈ పత్రం ప్రపంచవ్యాప్తంగా ఆమోదం పొందుతుంది. అయితే ఇది ఒక వ్యక్తిని భారతీయ పౌరుడిగా గుర్తించేందుకు చట్టబద్ధమైన నిదర్శనం ఎంతమాత్రం కాదు. మిగతా దేశాలతో పోలిస్తే భారత పౌరసత్వ నిర్ధారణలో ఒక పెద్ద సమస్య దాగి ఉంది. అమెరికా, బ్రిటన్ లాంటి దేశాల్లో పౌరులందరికీ ఒకే తరహా యూనివర్సల్ సిటిజన్ షిప్ సర్టిఫికెట్ ఉంటుంది. కానీ మన దేశంలో పౌరులందరికీ ఇచ్చే ఒకే ఒక్క పౌరసత్వ ధృవీకరణ పత్రం అంటూ ఏదీ లేదు. ఎక్కువ మంది భారతీయుల పౌరసత్వం పుట్టుక ఆధారంగానే వస్తుంది. చాలామంది పాతతరం భారతీయులకు ఓటరు జాబితాలు, స్కూల్ సర్టిఫికెట్లు, భూమి రికార్డులే ప్రధాన ఆధారాలు. వీటన్నింటినీ క్రమబద్ధీకరించేందుకే ఎన్నార్సీ అమలును గతంలో ప్రతిపాదించారు. అసోంలో అమలు చేసిన ఎన్నార్సీలో సరైన డాక్యుమెంట్లు లేక దాదాపు 19 లక్షల మంది జాబితాలో చోటు కోల్పోయారు. అందుకే రాజ్యాంగం కల్పించిన పౌరసత్వ నిబంధనల పట్ల సరైన అవగాహన ఉండటం అత్యంత అవసరం. న్యాయపరమైన సవాళ్లు ఎదురైనప్పుడు.. కోర్టుల్లో పాస్‌పోర్ట్ చూపించి పౌరసత్వాన్ని నిరూపించుకోలేరు. భారత పౌరులు ఎవరనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 5 నుంచి 11 వరకు 1955 పౌరసత్వ చట్టం స్పష్టంగా నిర్వచించాయి. ఈ చట్టాల ప్రకారం ఏ ఒక్క పత్రం కూడా పౌరసత్వానికి పూర్తి స్థాయి ఆధారంగా పరిగణించదు. పౌరసత్వం అనేది పుట్టుక.. తల్లిదండ్రుల మూలాలు.. నివాసం ఆధారంగా వచ్చే ఒక చట్టపరమైన హోదా. మన దగ్గర ఉన్న రికార్డులు కేవలం ఆ వాస్తవాలను నిర్ధారించే సాక్ష్యాలుగా మాత్రమే పనిచేస్తాయి. ఉదాహరణకు ఆధార్, ఓటర్ ఐడీ, పాన్ కార్డ్ లాంటివి గుర్తింపు కార్డులు మాత్రమే కానీ అవే పౌరసత్వానికి తుది ఆధారాలు కావు. 1955 పౌరసత్వ చట్టం ప్రకారం పౌరసత్వాన్ని నాలుగు మార్గాల్లో పొందవచ్చు. మొదటిది పుట్టుకతో వచ్చే పౌరసత్వం. 1950 నుంచి 1987 మధ్య భారత్‌లో జన్మించిన వారందరూ సహజంగానే పౌరులు అవుతారు. ఆ తర్వాత 2003 వరకు జన్మించిన వారిలో తల్లిదండ్రుల్లో కనీసం ఒక్కరైనా భారతీయులై ఉండాలి. ఇక రెండో మార్గం వారసత్వం. విదేశాల్లో పుట్టిన పిల్లల తల్లిదండ్రుల్లో ఒకరు భారతీయులై ఉండి.. ఏడాదిలోపు కాన్సులేట్‌లో నమోదు చేసుకుంటే పౌరసత్వం లభిస్తుంది. మూడోది రిజిస్ట్రేషన్ ద్వారా.. నాలుగోది నిర్దిష్ట కాలం దేశంలో ఉండటం ద్వారా పొందే పౌరసత్వం. ఇది కనీసం 12 ఏళ్ల పాటు భారత్‌లో నివసించిన విదేశీయులకు ఇస్తారు. పాకిస్థాన్ సింగర్ అద్నాన్ సమీకి ఇలాగే భారత పౌరసత్వం లభించింది. పౌరులు కాని వారికి పాస్‌పోర్టు ఇవ్వకూడదనే నియమం కూడా ఏమీ లేదు. పాస్‌పోర్ట్ చట్టంలోని సెక్షన్ 20 ప్రకారం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పరిస్థితుల్లో విదేశీయులకు కూడా ట్రావెల్ డాక్యుమెంట్లు జారీ చేయవచ్చు. దేశ ప్రయోజనాల దృష్ట్యా ఈ అధికారాన్ని కేంద్రం ఉపయోగిస్తుంది. రాజకీయ కారణాలతో ఏ దేశం లేని వాళ్లుగా మిగిలిపోయిన వారికి ఇలాంటి వెసులుబాటు ఇస్తారు. భారత్‌లో ఉంటున్న టిబెటన్ శరణార్థులకు, శ్రీలంక తమిళులకు వేరే దేశాలకు వెళ్లేందుకు ప్రత్యేక ప్రయాణ పత్రాలు జారీ చేస్తారు. ఇవన్నీ చూస్తే.. పాస్‌పోర్ట్ ఉంటే వారు పక్కా భారతీయులు అనుకోవడం పొరపాటే అవుతుంది. పౌరసత్వ వివాదాలపై దేశంలోని అత్యున్నత న్యాయస్థానాలు ఎన్నోసార్లు స్పష్టమైన తీర్పులు ఇచ్చాయి. సుప్రీంకోర్టు సహా పలు హైకోర్టులు పాస్‌పోర్టును ఒక గుర్తింపుగా మాత్రమే చూశాయి. ఓటరు నమోదు కోసం ఎన్నికల సంఘం పాస్‌పోర్ట్, జనన ధృవీకరణ పత్రాలను బలమైన సాక్ష్యాలుగా అంగీకరిస్తుంది. కానీ కోర్టులు మాత్రం పౌరసత్వ వివాదాల్లో వీటిని తుది ఆధారాలుగా అంగీకరించవు. పౌరసత్వాన్ని నిరూపించుకునే బాధ్యత పూర్తిగా సదరు వ్యక్తి పైనే ఉంటుందని కోర్టులు తేల్చి చెప్పాయి. దీంతో ఇప్పుడు పౌరసత్వ కార్డులు తీసుకోవాల్సిన అవసరం కూడ ఆ రావచ్చు. దీనికి కూడా కేంద్రం కసరత్తు చేస్తుందా అన్నది చూడాలి. ఆధార్‌ను పరిగణలోకి తీసుకోకుంటే సమగ్రమైన భారతీయతకు సంబంధించిన కార్డు లేదా పత్రం అవసరం ఏర్పడింది.

# తెలంగాణపై విషం చిమ్మిన చౌహాన్

## ఎపిని పొగుడుతూ..తెలంగాణపై అక్కసు




**న్యూఢిల్లీ,జూన్30 (ఆర్ఎన్ఎ):** తెలంగాణ రాష్ట్రంపై కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఓ రకంగా విషం కక్కారు. ఇటీవల కేంద్ర మంత్రులు అడపాదడపా విషం కక్కుతూనే ఉన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి మన రాష్ట్రానికే చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులకు పెద్దగా పట్టింపు లేదు. ఏదైనా పని కావాలని పట్టుబట్టి చేయించడం లేదు. ఈ క్రమంలో గ్రామీణాభివృద్ధి శాఖళ మంత్రుల సమావేశంలో శివరాజ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. గ్రామీణ పథకాల అమలులో తెలంగాణ వెనుకబడి ఉందన్నారు. అంతేగాకుండా ఆంధ్రా మత్రాం భేషుగ్గా పనిచేస్తోందని స్తుతించారు. చంద్రబాబు దయాదాక్షిణ్యాలతో మోడీ సర్కార్ నడుస్తోంది. అందుకే ఈ మధ్య బాబును పొగడం కేంద్రమంత్రులు బాగా అలవాటు చేసుకున్నారు. పనులు గట్టెక్కించుకునే క్రమంలో చంద్రబాబు కూడా మోడీని ఆకాశానికి ఎత్తుతున్నారు. కానీ మధ్యలో తెలంగాణలో తెగడాల్సిన పనిలేదు. కానీ ఇప్పుడు జరుగుతున్నది అదే. సోమవారం న్యూఢిల్లీలో గ్రామీణాభివృద్ధి పథకాల అమలుపై మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి 27 రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రులు హాజరయ్యారు. ఇందులో తెలంగాణ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం గురించి ఆయన మాట్లాడుతూ.. పీఎంజీఎస్‌వై రహదారుల పనులు వేగవంతం కావాలని పేర్కొన్నారు. పెండింగ్ రహదారి పనులు పూర్తి చేయాలని సూచించారు. పీఎం ఆవాస్ సర్వే త్వరగా పూర్తి చేయాలని తెలంగాణ గ్రామీణాభివృద్ధి మంత్రితోపాటు ఆ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖలో ఖాళీలు వెంటనే భర్తీ చేయాలని వారికి ఈ సందర్భంగా కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. అలాగే గ్రామాల అభివృద్ధే వికసిత్ భారత్‌కు పునాది కావాలని ఆయన ఆకాంక్షించారు. రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయన సూచించారు. జులై 1వ తేదీ నుంచి వికసిత్ భారత్ గ్రామీణ యోజన అమలు చేస్తున్నట్లు చెప్పారు. నిధుల వాటా సమయానికి విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ కోరారు. పనిలో పనిగా గ్రామీణాభి వృద్ధి పథకాల అమలులో ముందంజలో ఉందంటూ ఆంధ్రప్రదేశ్‌పై కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ ప్రశంసలు కురిపించారు. వీబీజీఆర్ఎంఏజీఐ నోటిఫికేషన్ పూర్తి చేసిన రాష్ట్రాల జాబితాలో ఏపీ ఉందన్నారు. జులై 2వ తేదీన తిరుపతిలో వీబీజీఆర్ఎంఏజీఐ ప్రారంభిస్తామని ప్రకటించారు. జాతీయ ప్రారంభోత్సవానికి ఆతిథ్య రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను ఎంపిక చేశామన్నారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన నాణ్యతలో దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రాల్లో ఏపీకి స్థానం దక్కిందని మంత్రి శివరాజ్‌సింగ్ వివరించారు. ఇదంతా కేవలం కావాలని చేస్తున్న ప్రకటనగానే చూడాలి. తెలంగాణపై విషం కక్కేందుకు ఎలాంటి అవకాశాన్ని కూడా కేంద్రం వదులుకోవడం లేదు. ఇక్కడ కాంగ్రెస్ అధికారంలో ఉన్నది పక్కన పెడితే కనీసం అభివృద్ధికి కేంద్రం తోడ్పాటు ఇవ్వడం లేదు. అభివృద్ధి ఆగిపోతే అది ప్రజలకే నష్టం అన్న జ్ఞానం ఇక్కడ ఉన్న ఇద్దరు మంత్రులకు కలగడం లేదు. బాబును పొగడడం కోసం ఎంతకైనా తెగిస్తారనడానికి ఇదే నిదర్శనం.

# వరంగల్ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా

## బీజేపీ నాయకులకు మంత్రి పొన్నం సవాల్



**సిద్దిపేట,జూన్30(ఆర్ఎన్ఎ):** వరంగల్ అభివృద్ధి గురించి మాట్లాడే ముందు బీజేపీ నాయకులు ప్రజలకు నిజాలు చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ చేశారు. కొత్తగా జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన నాయకుడు కేవలం తనను తాను నిరూపించుకోవాలనే ఉద్దేశంతో వాస్తవాలు తెలియకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. వరంగల్ ఎయిర్‌పోర్టును మంజూరు చేసే అధికారం కేంద్ర ప్రభుత్వానిదే. రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన భూమిని ఇప్పటికే ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే ఎయిర్‌పోర్టు ప్రక్రియ వేగం పుంజుకుంది. పదేళ్లు కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు పూర్తి చేయలేకపోయారో ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ద్వారా పట్టణాల అభివృద్ధికి మా ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు వెచ్చిస్తోంది. హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో సుమారు రూ.5 వేల కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించాం. హైదరాబాద్ తర్వాత వరంగల్‌ను అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దడమే మా ప్రభుత్వ లక్ష్యం. స్మార్ట్ సిటీ నిధులపై ఆరోపణలు చేసే బీజేపీ, పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉండి ఎందుకు చర్యలు తీసుకోలేదో చెప్పాలి. నిధులు వెనక్కి వెళ్లే పరిస్థితి ఎందుకు వచ్చిందో కూడా సమాధానం ఇవ్వాలన్నారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతున్న తీరు ఆశ్చర్యంగా ఉంది. కార్పొరేషన్‌లో మెజారిటీ లేకుండా మేయర్ అవుతామని చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని అన్నారు. ఎరువుల సరఫరా విషయంలో కూడా బీజేపీ వాస్తవాలను వక్రీకరిస్తోంది. ఎరువులు తయారు చేసి రాష్ట్రాలకు పంపిణీ చేసేది కేంద్ర ప్రభుత్వమే. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వాటిని అందించే బాధ్యతను నిర్వర్తిస్తోంది. తెలంగాణకు రావాల్సిన నిధులు, ఎరువుల విషయంలో కేంద్రం అన్యాయం చేస్తోందన్నారు. తెలంగాణ నుంచి కేంద్రానికి వెళ్లే ప్రతి రూ.10లో తిరిగి కేవలం రూ.3 మాత్రమే వస్తున్నాయి. మిగిలిన నిధుల గురించి కేంద్రం సమాధానం చెప్పాలి. ముఖ్యమంత్రి గారు, మంత్రులు పలుమార్లు ఢిల్లీ వెళ్లినా రాష్ట్రానికి రావాల్సిన నిధులపై స్పందన లేదన్నారు. వరంగల్ అభివృద్ధిపై కేంద్ర మంత్రి బండి సంజయ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు ఎవరైనా బహిరంగ చర్చకు రావచ్చు. తెలంగాణకు బీజేపీ చేసిన మేలు ఏమిటో, వరంగల్ అభివృద్ధికి వారు చేసిన కృషి ఏమిటో ప్రజల ముందే చర్చిద్దాం అని మంత్రి అన్నారు.

# తృణమూల్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ

## పార్టీ బ్యాంక్ ఖాతాల ఫ్రీజ్‌పై అత్యవసర విచారణకు నో

**కోల్‌కతా,జూన్30(ఆర్ఎన్ఎ):** తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి కోల్‌కతా హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ బ్యాంక్ ఖాతాల ఫ్రీజింగ్‌ను సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యవసర విచారణ జరపాలన్న టీఎంసీ విజ్ఞప్తిని న్యాయస్థానం తిరస్కరించింది. టీఎంసీ బ్యాంక్ ఖాతాల నిలిపివేత కారణంగా పార్టీ కార్యకలాపాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని, తక్షణ విచారణ అవసరమని ఆ పార్టీ తరఫు న్యాయవాదులు న్యాయస్థానాన్ని కోరారు. అయితే ఈ అంశంలో ఎలాంటి అత్యవసర పరిస్థితి కనిపించడం లేదని పేర్కొంటూ కోల్‌కతా హైకోర్టు వెంటనే విచారణ చేపట్టేందుకు నిరాకరించింది. ఈ కేసును విచారించిన జస్టిస్ అమృతా సిన్హా సాధారణ లిస్టింగ్ పక్రియ ప్రకారమే పిటిషన్ విచారణ జరుగుతుందని స్పష్టం చేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థల చర్యల నేపథ్యంలో తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలు బ్యాంక్ ఖాతాలు స్తంభించిపోయాయి. ఖాతాలు ఫ్రీజ్ చేయడం వల్ల ఆ పార్టీ రోజువారీ కార్యకలాపాలు, ఉద్యోగుల చెల్లింపులు, సంస్థాగత వ్యయాలు, రాజకీయ కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన నిధుల వినియోగంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని టీఎంసీ న్యాయవాదులు వాదించారు. అయితే హైకోర్టు తక్షణ ఉపశమనం ఇవ్వడానికి నిరాకరించడంతో టీఎంసీ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కేసు విచారణకు వచ్చే వరకు ఆ పార్టీ నేతలు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దిలా ఉండగా, కోల్‌కతా హైకోర్టు నిర్ణయం నేపథ్యంలో తదుపరి న్యాయపరమైన అవకాశాలను పరిశీలిస్తున్న తృణమూల్ కాంగ్రెస్ నాయకత్వం, అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయించే అంశంపై ఆలోచిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ వ్యవహారం పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కేసు రెగ్యులర్ విచారణలో కోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశంపై ఆసక్తి నెలకొంది.

# రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో భారీ పేలుడు

## పేలుడు ధాటికి గోడలు, కిటికీలు ధ్వంసం
## పేలుడు మిస్టరీపై పోలీసులు ఆరా

**హైదరాబాద్,జూన్30(ఆర్ఎన్ఎ):** హైదరాబాద్ నగరంలోని సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ పేలుడు తీవ్ర కలకలం రేపింది. రోడ్ నంబర్-4లోని ఓ రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి ఇంటి గోడలు, తలుపులు, కిటికీలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అయితే ఈ పేలుడు ఎలా జరిగిందనేది మిస్టరీగా మారింది. ఇంట్లోని మూడు గ్యాస్ సిలిండర్లు, ఫ్రిజ్, గీజర్ పేలలేదని తేలింది. అలాగే అగ్నిప్రమాద ఆనవాళ్లు కూడా కనిపించలేదు. ఘటన సమయంలో కుటుంబసభ్యులు ఇంట్లోనే ఉన్నారు. వీరంతా ఎలాంటి గాయాలు లేకుండా సురక్షితంగా బయటపడ్డారు. రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి దేవేందర్ తన భార్య, కుమారుడితో కలిసి గత 24 సంవత్సరాలుగా అక్కడే ఉంటున్నారు. మంగళవారం ఇంట్లోని వంటింట్లో ఒక్కసారిగా భారీ శబ్దం వినిపించింది. పేలుడు ధాటికి ఇల్లు తీవ్రంగా దెబ్బతిన్నది. పేలుడు మిస్టరిగా మారింది. ఇంట్లో అగ్ని ప్రమాదం ఆనవాళ్లు కూడా కనిపించలేదు. భారీ శబ్దానికి, ఇంటి ధ్వంసానికి కారణమేంటనేది ప్రశ్నార్థకంగా మారింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సరూర్‌నగర్ పరిధిలోని బాపూనగర్ రోడ్ నెంబర్-4లో రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి దేవేందర్ అతని భార్య, కుమారుడితో కలిసి 24ఏళ్లుగా నివాసముంటున్నారు.

# అరుణాచల్‌లో చైనా చొరబాట్లు

## మీడియా కథనాలను తోసిపుచ్చిన ఆర్మీ

**న్యూఢిల్లీ,జూన్30 (ఆర్ఎన్ఎ):** చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ అరుణాచల్ ప్రదేశ్‌లో చొరబాట్లకు పాల్పడిందని, అక్కడ సైనిక శిబిరాలను ఏర్పాటు చేసిందని కొన్ని కథనాలు ప్రచారం కావడంతో, వాటిని భారత సైన్యం తోసిపుచ్చింది. ఆ కథనాల్లో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేసింది. అదంతా ఎలాంటి ఆధారం లేకుండా జరుగుతోన్న అసత్య ప్రచారమని వెల్లడించింది. మీడియా కథనాల ప్రకారం.. అరుణాచల్ ప్రదేశ్ లోని తక్సింగ్ ప్రాంతంలోని నాహ్ ట్రైబల్ గ్రూప్‌నకు చెందిన నాహ్ వెల్ఫేర్ సొసైటీ .. ప్రభుత్వ అధికారులకు గతంలో ఒక వినతి పత్రాన్ని సమర్పించింది. భారత్-చైనా సరిహద్దు సమీపంలో పీఎల్ఏ శిబిరాలను ఏర్పాటు చేసిందని అందులో ఆరోపించింది. గత 10-15 సంవత్సరాలుగా చైనా సైనికులు తక్సింగ్ సరిహద్దు వెంట చొరబాట్లను క్రమంగా విస్తరిస్తున్నారని పేర్కొంది. వేట, పశువుల మేత, అటవీ ఉత్పత్తుల సేకరణ కోసం స్థానికులు ఉపయోగించే ప్రదేశాల్లో రోడ్లు, వంతెనలు,

సైనిక శిబిరాలను నిర్మించారని ఆరోపించింది. ఆ ప్రాంతాల పేర్లను ప్రస్తావించింది. భారత సరిహద్దు ప్రాంతాల్లో చైనా కార్యకలాపాలు మరింత విస్తరించకుండా నిరోధించేలా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలని కోరింది. ఈ వినతి పత్రాన్నే మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలోనే ఆర్మీ స్పందన వచ్చింది. ఇటీవల బీజింగ్‌లో భారత్-చైనా సరిహద్దు వ్యవహారాలకు సంబంధించిన సమావేశం జరిగింది. రెండు దేశాల మధ్య నిర్మాణాత్మక చర్చలు జరిగాయని విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే మీడియా కథనాలు రావడం గమనార్హం.

# ముంబై చేరుకున్న పవన్ కళ్యాణ్



**అమరావతి,జూన్30(ఆర్ఎన్ఎ):** జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ముంబయి చేరుకున్నారు. గత కొంతకాలంగా భుజాలకి సంబంధించిన రొటేటర్ కఫ్ గాయం, రెండు భుజాలకి చెందిన కండరాలు పూర్తిగా చిట్లడంతో ఆయన ఇబ్బందిపడుతున్నారు. దీంతో వైద్య పరీక్షల నిమిత్తం ముంబయిలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆస్పత్రికి పవన్ వెళ్లనున్నారు. పవన్‌కల్యాణ్ వెంట ఆయన సతీమణి అన్నా కొణిదెల ఉన్నారు.

# 30 నెలల్లో రూ.30 వేల కోట్ల రైతు భరోసా నిధుల ఎగవేత


## సభల పేరుతో నాటకాలు తప్ప రైతులకు చేసిందేమీ లేదు... మరోమారు ఎక్స్ వేదికగా రేవంత్‌పై కెటిఆర్ విమర్శలు



**హైదరాబాద్,జూన్ 30(ఆర్ఎన్ఎ):** 30 నెలల పాలనలో రూ.30 వేల కోట్ల రైతుభరోసా నిధులను ఎగ్గొటారని, పైగా సభల పేరుతో నాటకాలు ఆడుతున్నారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ మండిపడ్డారు. ఏకంగా నాలుగుసార్లు రైతు భరోసా నిధులను ఎగ్గొట్టారని ఆరోపించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టార్గెట్‌గా మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి విమర్శలు గుప్పించారు. మంగళవారం హైదరాబాద్ శిల్పకళా వేదికలో సీఎం రేవంత్ రైతు భరోసా నిధులను విడుదల చేయనున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వంపై ఎక్స్ వేదికగా మాజీ మంత్రి విరుచుకుపడ్డారు. మీ 30 నెలల ముదనష్టపు పాలనలో దాదాపు రూ.30 వేల కోట్ల రైతుభరోసా ఎగ్గొట్టడమే కాకుండా మళ్లీ సభల పేరిట నాటకాలు ఆడటానికి ఏమాత్రం సిగ్గనిపిస్తలేదా? గత రెండున్నరేళ్లలో ఎగ్గొట్టిందే ఎక్కువ అని 70 లక్షల మంది రైతులు శాపనార్థాలు పెడుతుంటే.. ఆశీర్వాద సభల పేరిట డ్రామాలా? కేవలం ఒక్క బటన్ నొక్కి వేయాల్సిన రైతుభరోసాకు కూడా బహిరంగ సభ పెట్టే.. నీ పీఆర్ స్టంట్లు చూసి రైతులు అసహ్యించు కుంటున్నారు. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా నాలుగుసార్లు రైతుభరోసా ఎగ్గొట్టిన మీ ద్రోహాన్ని రైతులు మరిచిపోతారని అనుకోవడం మీ అవివేకమే. ప్రతి ఎకరానికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తానని గ్యారెంటీల గారడీ చేసి, చివరికి ఉన్నది ఊడగొట్టే దుస్థితి తెచ్చినందుకు ముందు ముక్కునేలకు రాయాలి. అరకొరగా ఒకటి, రెండు ఎకరాలకు వేసినట్టు చేసి చేతులు దులుపుకుంటున్న మీ పాపం మిమ్మల్ని నిరంతరం శాపంలా వెంటాడటం ఖాయం. ఇప్పటికే రూ.50 వేల కోట్లతో చేయాల్సిన రెండులక్షల రుణమాఫీని, చారాణా కూడా చేయకుండా అధికారంలోకి రాగానే అన్నదాత గొంతుకోశావు. 72 సార్లు నీ ఢిల్లీ టూర్లకు, పనికిరాని ఈ పబ్లిక్ మీటింగ్‌లకు పెడుతున్న కోట్ల రూపాయల ఖర్చును ఆదాచేసి ఉంటే రైతులకు పెట్టుబడి సాయం దక్కేది.

రాష్ట్రవ్యాప్తంగా యూరియా దొరకక అల్లాడుతున్న అన్నదాతల కష్టాల నుంచి అటెన్షన్ డైవర్షన్ చేసే ఈ దిక్కుమాలిన చర్యలు ఏమాత్రం పనిచేయవని గుర్తుపెట్టుకో. కేంద్రం ఎంత కొంటే అంతే కొంటామని పంట కొనుగోళ్ల బాధ్యత నుంచి పూర్తిగా తప్పుకున్న మీ చేతకానితనాన్ని చూసి అన్నదాతలు పట్టలేని కోపంతో రగిలిపోతున్నారు. కేసీఆర్ టంచన్‌గా 11 సార్లు, రూ.73 వేల కోట్లను నేరుగా రైతుల ఖాతాలో వేసి రాష్ట్రంలో వ్యవసాయ విప్లవానికి నాంది పలికారు. పదేళ్లు పండగలా సాగిన వ్యవసాయాన్ని దండగలా మార్చి, రైతుకు వెన్నుపోటు పొడుస్తున్న మీ దుర్మార్గాన్ని అన్నదాతలు ఎన్నటికీ క్షమించే ప్రసక్తే లేదు. తెలంగాణ రాష్ట్ర చరిత్రలో రైతు బాంధవుడిగా కేసీఆర్ నిలిచి ఉంటే.. మీరు ఎప్పటికీ రైతు ద్రోహిగానే మిగిలి ఉంటారని గుర్తుపెట్టుకోండి' అంటూ ఎక్స్‌లో కేటీఆర్ పోస్ట్ చేశారు.

# ఈ లక్షణాల్లో ఏ ఒకటి ఉన్నా మీ కిడ్నీలో క్యాన్సర్ కణాలు పెరుగుతున్నాయని అర్థం... జాగ్రత్త!



మానవ శరీరం యొక్క అతి ముఖ్యమైన మరియు చురుకైన అవయవం మూత్రపిండాలు. ఎందుకంటే మన శరీరంలోని రక్తాన్ని పదే పదే శుద్ధి చేయడం ద్వారా మన ఆరోగ్యవంతమైన జీవితానికి అత్యంత అవసరమైన వాటిలో కిడ్నీలు ఒకటి. మన శరీరంలో ఒక కిడ్నీకి బదులుగా రెండు కిడ్నీలు ఉన్నప్పటికీ, దీని అవసరం మనకు చాలా ముఖ్యం. కిడ్నీ క్యాన్సర్ అని కూడా పిలువబడే కిడ్నీ సెల్ అడెనోకార్సినోమా, ప్రపంచంలోని టాప్ 10 క్యాన్సర్లలో ఒకటి. దీన్ని ముందుగా గుర్తిస్తే చికిత్సకు అనుకూలమైన ఫలితాలు పొందవచ్చు. మీరు లేదా కుటుంబ సభ్యులు ఈ క్రింది లక్షణాలలో దేనినైనా గమనించినట్లయితే, వాటిని ముఖ్యమైనవిగా భావించకుండా, వెంటనే వైద్యుడిని సంప్రదించండి.

### మూత్రంలో రక్తం (హెమటూరియా)

ఇది చాలా సాధారణమైన లక్షణం మరియు కొంచెం ఎర్రగా కనిపించడం కూడా కిడ్నీలో ఏదో లోపం ఉందని సంకేతం. ఇది ఇన్ఫెక్షన్ కూడా కావచ్చు, కానీ క్యాన్సర్‌ని నిర్ధారించడం చాలా ముఖ్యం మరియు వెంటనే మూత్రంలో రక్తాన్ని పరీక్షించాలి.

### ఉదరం కణితి

ఇది మరొక చాలా సాధారణ లక్షణం, ఇది పొత్తికడుపులో (ముందు లేదా వెనుక) ఉండవచ్చు మరియు చర్మం కింద గట్టి, దట్టమైన వాపులా అనిపిస్తుంది. ఇది ఒక సాధారణ లక్షణం అయినప్పటికీ, ఇది ప్రారంభ దశలలో వ్యక్తపరచబడదు.

### దిగువ వెనుక భాగంలో నొప్పి

అసాధారణ నొప్పులు మరియు తిమ్మిర్లు సాధారణంగా వృద్ధాప్యంలో సాధారణ భాగం అయినప్పటికీ, అవి కొన్నిసార్లు మూత్రపిండాల క్యాన్సర్‌కు ముందస్తు హెచ్చరిక సంకేతాలు కావచ్చు. దిగువ వెన్ను లేదా వైపు నొప్పి మూత్రపిండ క్యాన్సర్ యొక్క ఆలస్యమైన లక్షణం కావచ్చు. నొప్పి యొక్క రకం సాధారణ కండరాల నొప్పి వలె ఉండదు, కానీ ఇది చాలా రోజుల పాటు నిస్తేజంగా నొప్పిగా ఉండే పదునైన కత్తిపోటు నొప్పి వలె ఉంటుంది.

### అనోరెక్సియా మరియు

### ఆకస్మిక బరువు తగ్గడం

ఆకస్మిక ఆకలి లేకపోవడం లేదా ఆకస్మిక బరువు తగ్గడం అనేది క్యాన్సర్ పురోగతికి హెచ్చరిక సంకేతం. కిడ్నీ క్యాన్సర్ విషయంలో, ఈ లక్షణం క్యాన్సర్ ఇతర ప్రాంతాలకు వ్యాపించిందని సూచిస్తుంది.

### రక్తహీనత / అలసట

మూత్రపిండాలు ఎర్ర రక్త కణాలను ఉత్పత్తి చేయడానికి శరీరానికి తెలియజేసే పనిని నిర్వహిస్తాయి. కిడ్నీలో క్యాన్సర్ ఉన్నట్లయితే, ఈ సమాచారం ప్రసారం చేయబడదు, ఇది తక్కువ ఉత్పత్తికి దారితీస్తుంది, ఇది రక్తహీనతకు దారితీస్తుంది. ఇది అలసట భావనలకు దారి తీస్తుంది. అయితే, క్యాన్సర్ అలసట సాధారణ అలసట కాదు. ఇది మిమ్మల్ని చాలా బలహీనంగా భావిస్తుంది మరియు మంచి రాత్రి నిద్ర తర్వాత కూడా శక్తి లేకుండా సాధారణ పనులను చేయడానికి మిమ్మల్ని అనుమతించదు. మీరు ఈ అసాధారణ అలసటను అనుభవించినప్పుడు వైద్యుడిని సంప్రదించండి.


### స్క్రోటమ్ యొక్క వాపు

పురుషులు వారి స్క్రోటమ్‌లో అకస్మాత్తుగా వాపు సిరలు కనిపించడం గమనించవచ్చు (దీనిని వెరికోసెల్ అని కూడా పిలుస్తారు). ఇది కిడ్నీ క్యాన్సర్‌కు కారణమవుతుంది మరియు స్క్రోటమ్‌కు రక్త ప్రవాహాన్ని ప్రభావితం చేస్తుంది.

### జ్వరం

లక్షణం లేని జ్వరం కొన్ని వారాల పాటు కొనసాగుతుంది, అది ఒక లక్షణం కావచ్చు మరియు మీరు దాన్ని తనిఖీ చేయాలి. క్యాన్సర్ శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపించినప్పుడు, రక్తం దగ్గు, ఎముకలలో నొప్పి మరియు శ్వాస ఆడకపోవడం వంటి అదనపు లక్షణాలు కనిపిస్తాయి.

# మతిమరుపు తగ్గాలంటే ఈ ఆహారం తీసుకోవాల్సిందే!




మతి మరుపు సమస్య చాలా ప్రమాదకరమైనది. ఇక ఈ మధ్యకాలంలో అన్ని వయసుల వారిని కూడా ఈ మతి మరుపు సమస్య చాలా ఎక్కువగా వేధిస్తోంది. ఐతే సరైన జీవనశైలితోపాటు ఇంకా అలాగే కొన్ని ఆహార అలవాట్ల ద్వారా బ్రెయిను బాగా షార్ప్ చేసుకోవచ్చని పలు అధ్యయనాలు చెబుతున్నాయి.ఎందుకంటే మతి మరుపు అనేది అసలు నయం చేసుకోలేని జబ్బుకాదు.

మెదడుకు మేత పెట్టే కొన్ని రకాల ఆహారాల గురించి హార్వర్డ్ మెడికల్ స్కూల్ ప్రొఫెసర్ ఇంకా అలాగే మాసాచుసెట్స్ జనరల్ హాస్పిటల్ డైరెక్టర్ ఆఫ్ న్యూట్రిషనల్ అండ్ లైఫ్‌స్టైల్ సైకియాట్రీ డాక్టర్ అయిన ఉమానాయుడు సూచిస్తున్నారు. ఇక అవేంటో మనం ఇప్పుడు పూర్తిగా తెలుసుకుందాం..

1. పాలకూర: పాలకూర అనేది ఏకాగ్రతను పెంచడంతో పాటు మెదడు పనితీరును కూడా బాగా మెరుగుపరుస్తుంది..
2. కాఫీ ఇంకా టీ: కాఫీ లేదా టీ కూడా మతిమరుపు సమస్యను ఈజీగా పోగొడతాయి. ప్రతి రోజూ కూడా రెండు నుంచి మూడు కప్పులకు మించకుండా తాగే కాఫీ లేదా టీ వల్ల మెమరీ పవర్ బాగా పెరుగుతుంది.కాఫీ లేదా టీ బాగా చురుకుగా ఉండేందుకు దోహదపడతాయి.
3. చేపలు: ఆహారపుటలవాట్లను బట్టి ఇంకా అలాగే ఇష్టాయిష్టాలను బట్టి వారానికి ఒకటి లేదా రెండుసార్లు కనుక చేపలు తింటే మతిమరుపు తగ్గి ఏకాగ్రత అనేది బాగా పెరుగుతుంది..
4. క్యారట్: ఇక క్యారెట్ కూడా మతిమరుపు సమస్యకి చాలా మంచిది.ఇది వయసు పెరగడం వల్ల వచ్చే మెమరీ సమస్యలను ఈజీగా తగ్గిస్తుంది..
5. వాల్ నట్స్: వాల్ నట్స్ అనేవి జ్ఞాపకశక్తి పెరగడంతోపాటు స్కిల్స్ బాగా మెరుగుపడుతాయి.ఇక పండ్లు, కూరగాయలు, హోల్ గ్రెయిన్స్, అన్‌సాచురేటెడ్ ఫ్యాట్స్ ఇంకా అలాగే తక్కువ మొత్తంలో తీసుకునే రెడ్ మీట్ అల్జీమర్స్ అనే ఒక విధమైన మతిమరపు వ్యాధిని నిరోధిస్తాయని తెలిసిందే. వీటితో కూడా బ్రెయిన్ పవర్ కూడా బాగా పెంచుకోవచ్చు.

ఇక ఇవి మనం తీసుకునే ఆహారం. అలాగే వీటితోపాటు పజిల్స్ పూరించడం, చెస్ ఆడటం, చిన్నప్పుడు విన్న పద్యాలు ఇంకా అలాగే ఇష్టమైన పాటలు గుర్తు చేసుకుంటూ వాటిని రాయడం వంటివి చేస్తే అవి మెదడుకు పెట్టే మేత వల్ల కూడా జ్ఞాపక శక్తి అనేది బాగా పెరుగుతుంది.

# 'ఉద్యోగుల ఆరోగ్య పథకం'నిధిపై ఉత్తర్వులు

### ఉద్యోగుల మూల వేతనం నుంచి కోత

**హైదరాబాద్,జూన్30(ఆర్ఎన్ఎ):** తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు , వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య రక్షణ కోసం అమలవుతున్న 'ఉద్యోగుల ఆరోగ్య పథకం'నిధి సమకూర్పుపై రాష్ట్ర ఆర్థిక శాఖ సరికొత్త ఉత్తర్వులను జారీ చేసింది. జీవో 79 ప్రకారం ఇకపై ప్రతి ఉద్యోగి మూల వేతనం లేదా పెన్షనర్ల మూల పింఛను నుండి ప్రతి నెలా 1.5 శాతం మొత్తాన్ని ఈ ఈహెచ్ఎస్ హెల్త్ ఫండ్‌కు విరాళంగా కట్ చేయనున్నారు. మే 2026 నెలకు సంబంధించిన జీతాలు, పెన్షన్ల నుంచే ఈ కోత ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ నిధుల కోత విధానంలో ఉద్యోగులపై అదనపు భారం పడకుండా, ఎక్కడా డబుల్ కటింగ్ జరగకుండా ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను ఇచ్చింది. భార్యాభర్తలు ఇద్దరూ కూడా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తున్నప్పుడు, లేదా వారిలో ఒకరు ప్రభుత్వ ఉద్యోగిగా ఉండి మరొకరు ప్రభుత్వ పెన్షనర్‌గా ఉన్నప్పుడు కేవలం ఒక్కరి జీతం నుండి మాత్రమే ఈ మొత్తాన్ని మినహాయిస్తారు. అలాగే ఒకే వ్యక్తి ప్రభుత్వ సర్వీస్ పెన్షన్ , ఫ్యామిలీ పెన్షన్.. ఇలా రెండు పింఛన్లు పొందుతున్నప్పుడు కూడా ఒకే ఒక కోతకు నిబంధనలను పరిమితం చేశారు. ఇలాంటి సందర్భాలలో డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు ఉద్యోగుల వివరాలను ఐఎఫ్ఎంఐఎస్-హెచ్ఆర్ఎమ్ఎస్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్‌లో పక్కాగా నమోదు చేసి, పొరపాటున కూడా రెండోసారి కటింగ్ అవ్వకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఒకవేళ ఇప్పటికే ఎవరికైనా ఇలా అదనంగా డబ్బులు కట్ అయి ఉంటే, ఆ మొత్తాన్ని తిరిగి రీఫండ్ చేస్తామని ప్రభుత్వం భరోసా ఇచ్చింది. ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని మరింత సమర్థవంతంగా నడిపించేందుకు గానూ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చైర్‌పర్సన్‌గా ఒక ప్రత్యేక బోర్డ్ ఆఫ్ ట్రస్టీలతో కూడిన 'న్యూ ఎంప్లాయ్ హెల్త్ కేర్ ట్రస్ట్' ని ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. ఈ బోర్డులో ప్రభుత్వ ఉన్నతాధికారులతో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల ప్రతినిధులు కూడా సభ్యులుగా ఉంటారు. ఉద్యోగులు, పెన్షనర్లు ఇచ్చే 1.5 శాతం వాటా నిధికి సమానంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా తన వంతు మ్యాచింగ్ గ్రాంట్‌ను ఈ హెల్త్ కేర్ ట్రస్ట్‌కు జమ చేయనుంది. సేకరించిన నిధులన్నింటినీ ప్రత్యేక అకౌంట్ హెడ్ ద్వారా మెడికల్ అవసరాల నిమిత్తం భద్రపరుస్తారు.

# అమెరికా వరదల్లో గల్లంతయిన తెలుగు యువకుడు

### మృతదేహం లభ్యమైనట్లు పోలీసుల సమాచారం

**బాపట్ల,జూన్30(ఆర్ఎన్ఎ):** అమెరికాలో సంభవించిన వరదల్లో గల్లంతైన బాపట్ల జిల్లా పర్చూరు మండలం దేవరపల్లికి చెందిన దొప్పలపూడి వెంకటేశ్ (32) మృతదేహం లభ్యమైంది. వెంకటేశ్ తన కారుకు సమీపంలోనే బురదలో కూరుకుపోయి ఉన్నట్లు అక్కడి పోలీసులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయాన్ని మృతుడి బంధువులు వెల్లడించారు. మూడేళ్ల క్రితం అమెరికా వెళ్లి ఎంఎస్ పూర్తిచేసి ఉద్యోగం చేస్తున్న వెంకటేశ్ కాన్సాస్ ప్రాంతంలో సంభవించిన వరదల్లో కొట్టుకుపోగా.. అతడు ప్రయాణించే కారు, బ్యాగు ఉన్నట్లుగా కుటుంబ సభ్యులకు నిన్న సమాచారం అందడంతో వారంతా తీవ్ర ఆందోళనకు గురైన విషయం తెలిసిందే. ఈ ఘటనపై సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వెంకటేశ్ ఆచూకీ కనుగొనేలా చర్యలు చేపట్టాలని కేంద్రమంత్రులు కె.రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఏపీ ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్‌లకు లేఖలు రాశారు. ఈ క్రమంలో అక్కడి పోలీసులు చేపట్టిన సహాయక చర్యల్లో కారుకు సమీపంలో ఉన్న బురదలో కూరుకుపోయిన మృతదేహాన్ని వెలికితీయగా.. అది వెంకటేశ్‌దిగా గుర్తించినట్లు కుటుంబీకులకు సమాచారం అందించారు. చేతికి అందివచ్చిన కుమారుడు కన్నుమూశాడనే వార్తతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఈ ఘటనతో వెంకటేశ్ స్వగ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.


# దుబ్బాకలో భారీ చోరీ... ఇంట్లోకి చొరబడి బంగారం లూటీ

**సిద్దిపేట,జూన్30(ఆర్ఎన్ఎ):** దుబ్బాక పట్టణంలో భారీ చోరీ ఘటన చోటుచేసుకుంది. 15వ వార్డులోని ఓ ఇంట్లోకి దొంగలు చొరబడి నగదు, బంగారాన్ని ఎత్తుకెళ్లారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన చింత రాజ్‌కుమార్ అనే మెడికల్ ఏజెన్సీ నిర్వాహకుడు తన కుటుంబ సభ్యులతో కలిసి కాశీ యాత్రకు 9 రోజుల క్రితం వెళ్లాడు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి ఇంటి కిటికీ ఊచలను విరగ్గొట్టి దొంగలు లోనికి ప్రవేశించారు. పడకగదిలోని లాకర్‌ను పగలగొట్టి.. అందులో ఉన్న బంగారం, నగదును ఎత్తుకెళ్లారు. బంగారం సుమారు కేజీ వరకు ఉన్నట్లు సమాచారం.

# వ్యవసాయ రంగాన్ని సర్వనాశనం చేసిన వైసిపి

### రైతులు ఎరువుల, పురుగు మందులు తగ్గించాలి... భూసారం దెబ్బతినకుండా ఉద్యాన పంటలు వేయాలి... ఏరువాక కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు

**గుంటూరు, జూన్ 30 (ఆర్ఎన్ఎ):** వ్యవసాయ రంగాన్ని వైసీపీ నాశనం చేసిందని.. ఇప్పుడు మళ్లీ ఏదేదో విమర్శలు చేస్తున్నారని మంత్రి అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. మామిడి, పొగాకు రైతులకు ధరల ఇబ్బంది లేకుండా చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఎరువులు, పురుగు మందులను రైతులు తక్కువగా వాడాలని సూచించారు. భూమి ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏరువాక పౌర్ణమి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు 'ఏరువాక'ను ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో వ్యవసాయానికి కనీస సహకారం లేదని.. విత్తనాల కంపెనీలకు కూడా బకాయిలు పెట్టి వెళ్లారని మండిపడ్డారు. కూటమి అధికారంలో వచ్చాక రాయితీపై రైతులకు విత్తనాలు ఇస్తున్నామన్నారు. ప్రత్యేక యాప్ ద్వారా ఎరువులను అందిస్తున్నామన్నారు. యాప్ ద్వారా 20 రోజుల్లో 11 లక్షల మంది రైతులు ఎరువులు తీసుకున్నారని తెలిపారు. వీరిలో మూడు లక్షల మందికి




పైగా కౌలు రైతులు కూడా ఉన్నారన్నారు. రాష్ట్రంలో ఎక్కడా ఎరువుల కొరత లేదని స్పష్టం చేశారు. శాస్త్రవేత్తలు సూచించిన మేరకు మాత్రమే ఎరువులు వేయాలని అన్నారు. రైతులకు పచ్చిరొట్ట ఎరువుల కోసం రాయితీ ఇస్తున్నామన్నారు. మిర్చిలో పురుగు మందుల అవశేషాలు ఉన్నాయని చైనా మూడు కంటైనర్లు వెనక్కి పంపిందని.. ఈ విషయాన్ని రైతులు గమనించి పురుగు మందులు వాడకం తగ్గించాలని సూచించారు. వరిసాగును తగ్గించాలని చెప్పినా రైతులు పట్టించుకోవటం లేదని.. సరైన లాభాలు లేకపోయినా వరి వేసి నష్టాల పాలవుతున్నారని మంత్రి తెలిపారు. ఉద్యాన పంటలకు మంచి డిమాండ్ ఉందన్నారు. వ్యవసాయంలో 50 వేల కోట్ల ఆదాయం వస్తుంటే.. ఉద్యాన పంటలలో లక్షా 50 వేల కోట్ల ఆదాయం వస్తోందని తెలిపారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉంటుందని చెప్పారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని సూచించారు. వర్జీనియా పొగాకు ధర సరిగా లేదని టోబాకో బోర్డు, వ్యాపారులతో మాట్లాడామన్నారు. కిలో రూ.200 కంటే తక్కువకు కొనడానికి వీల్లేదని చెప్పామని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర, బూర్ల రామాంజనేయులు, జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధూళిపాళ్ల మాట్లాడుతూ.. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగానికి పెద్దపీత వేశారని తెలిపారు. అనేక రకాల పంటలకు గిట్టుబాటు ధర కల్పించారన్నారు. ఎరువులను ఇప్పుడు ఒక యాప్ ద్వారా అందిస్తున్నామని చెప్పారు. రైతులకు 3 బస్తాల యూరియా ఇస్తే ఉపయోగకరంగా ఉంటుందన్నారు. 2.5 ఎకరానికి ఒక బస్తా డీఏపీ ఇస్తున్నారని.. అలా కాకుండా ఎకరానికి ఒక బస్తా ఇస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే ధూళిపాళ్ల సూచించారు. రైతులకు అన్నదాతా సుఖీభవ ద్వారా ఎంతో లబ్ధి చేకూరుతోందని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. రైతుల సంక్షేమం కోసం పని చేసే వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని ఎమ్మెల్యే కొనియాడారు.

# తెలంగాణలో పలువురు ఐపిఎస్‌ల బదిలీ

### ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

**హైదరాబాద్,జూన్30(ఆర్ఎన్ఎ):** తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర పోలీసు శాఖలో ఐపీఎస్, ఎస్పీఎస్ అధికారుల బదిలీలు, పోస్టింగులు చేపట్టింది. ఈ మేరకు జీఓ ఆర్.టి. నెం.931ను జారీ చేసింది. పలువురు అధికారులకు కొత్త బాధ్యతలు అప్పగించగా, మరికొందరికి అదనపు బాధ్యతలు కేటాయించింది. రామగుండం పోలీస్ కమిషనర్‌గా కొనసాగుతున్న అంబర్ కిశోర్ ఝాకు డీఐజీ, జోన్-1 (కాళేశ్వరం) అదనపు బాధ్యతలు అప్పగించారు. హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ డి. జోయెల్ డేవిస్‌కు డీఐజీ, జోన్-5 (యాదాద్రి) బాధ్యతలు కూడా అప్పగించారు.

వరంగల్ పోలీస్ కమిషనర్‌గా ఉన్న సున్‌ప్రీత్ సింగ్‌ను సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ, డీఐజీ జోన్-3 (రాజన్న) అదనపు బాధ్యతలు ఇచ్చారు. హైదరాబాద్ నార్త్ రేంజ్ (లా అండ్ ఆర్డర్) జాయింట్ కమిషనర్‌గా ఉన్న ఎన్. శ్వేతను వరంగల్ పోలీస్ కమిషనర్‌గా నియమిస్తూ, డీఐజీ జోన్-4 (భద్రాద్రి) బాధ్యతలు కూడా అప్పగించారు.ఇంటెలిజెన్స్ సీఐ సెల్ డీఐజీగా కొనసాగుతున్న ఆర్. భాస్కరన్‌కు జోన్-2 (బాసర) డీఐజీ అదనపు బాధ్యతలు కేటాయించారు. స్పెషల్ బ్రాంచ్ జాయింట్ కమిషనర్ ఎస్.ఎం. విజయ్ కుమార్‌కు హైదరాబాద్ నార్త్ రేంజ్ జాయింట్ కమిషనర్ (లా అండ్ ఆర్డర్) అదనపు బాధ్యతలు అప్పగించారు. ఏసీబీ జాయింట్ డైరెక్టర్‌గా ఉన్న చి. సింధు శర్మను ఇంటెలిజెన్స్ సీఐ సెల్ ఎస్పీగా బదిలీ చేసి, ఎస్ఐబీ ఎస్పీ బాధ్యతలు కూడా అప్పగించారు. ఎస్ఐబీ ఎస్పీగా ఉన్న వై. సాయి శేఖర్‌ను సికింద్రాబాద్ రైల్వే పోలీస్ ఎస్పీగా బదిలీ చేశారు. హైదరాబాద్ డీసీపీ (ఎస్ఎం అండ్ ఐటీ)గా ఉన్న చెన్నూరి రూపేష్, ఏసీబీ జాయింట్ డైరెక్టర్ చి. ప్రవీణ్ కుమార్లను సీఐడీ ఎస్పీలుగా నియమించారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఆర్. వెంకటేశ్వర్లును హైదరాబాద్ సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీగా నియమించారు. వనపర్తి అదనపు ఎస్పీ (అడ్మిన్)గా ఉన్న రాజేష్ మీనాను వికారాబాద్ అదనపు ఎస్పీ (అడ్మిన్)గా బదిలీ చేశారు. వికారాబాద్ అదనపు ఎస్పీ (అడ్మిన్)గా ఉన్న బి. రాములు నాయక్‌ను ఆ బాధ్యతల నుంచి రిలీవ్ చేసి, డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

## ఐడీబీఐ బ్యాంకు ఖాతా నుండి రూ. 97 వేల మాయం

### : వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు



**విజయవాడ , జూన్30( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** బ్యాంకు ఖాతాల నుండి సైబర్ నేరగాళ్లు గుట్టుచప్పుడు కాకుండా డబ్బులు కాజేస్తున్న ఘటనలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. తాజాగా డింపుల్ జైన్ అనే మహిళకు చెందిన ఐడీబీఐ (IDBI) బ్యాంకు ఖాతా నుండి గుర్తుతెలియని వ్యక్తులు అక్రమంగా రూ. 97 వేల నగదును బదిలీ చేసుకున్నారు. బాధితురాలి కథనం ప్రకారం.. ఈ నెల 6వ తేదీ నుండి 11వ తేదీల మధ్య కాలంలో ఆమె ఖాతా నుండి మూడు విడతలుగా అనుమానాస్పద లావాదేవీలు జరిగాయి. తన ప్రమేయం లేకుండానే ఖాతాలో ఉన్న సొమ్ము విత్‌డ్రా అయినట్లు గమనించిన బాధితురాలు తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది. దీనిపై ఆమె వెంటనే స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక ఆధారాల సహాయంతో ఈ అక్రమ లావాదేవీలు ఎక్కడి నుండి జరిగాయి, నిందితులు ఎవరు అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. బ్యాంక్ ఖాతాదారులు తమ ఓటీపీలు, పిన్ నంబర్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

## ఇబ్రహీంపట్నంలో టీ ధరల మోత.. హాఫ్ టీ రూ.10..!



**నందిగామ జూన్30( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఇబ్రహీంపట్నం పట్టణంలోని కొన్ని టీ స్టాళ్లలో హాఫ్ టీకి రూ.10 వసూలు చేస్తున్నారని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరుగుతున్న ధరల భారంతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న సామాన్య ప్రజలకు టీ ధరల పెరుగుదల మరింత భారం అవుతోందని అంటున్నారు. ముఖ్యంగా హాఫ్ టీకి కూడా అధిక ధరలు వసూలు చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే టీ స్టాళ్లలో ధరల వివరాలను తెలిపే రేటు బోర్డులు లేకపోవడంతో వినియోగదారులు అయోమయానికి గురవుతున్నారు. టీ, కాఫీ తదితర వస్తువులకు ఎంత ధర వసూలు చేస్తున్నారో ముందస్తుగా తెలియకపోవడంతో కస్టమర్లు ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. వినియోగదారుల హక్కులకు భంగం కలగకుండా ప్రతి దుకాణంలో రేటు బోర్డులు ప్రదర్శించడం తప్పనిసరి చేయాలని స్థానికులు కోరుతున్నారు. టీ ధరలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి ధరల నియంత్రణపై దృష్టి సారించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే రేటు బోర్డులు ఏర్పాటు చేయించడంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వినియోగదారుల నుంచి వస్తున్న ఫిర్యాదులపై అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పి.కొట్టం విద్యార్థినికి 'షైనింగ్ స్టార్' సత్కారం



**కోటనందూరు జూన్30( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఇటీవల పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎల్.డి.పేట గ్రామానికి చెందిన కూనిశెట్టి యమునకు అరుదైన గుర్తింపు దక్కింది. తాడేపల్లిలో 'షైనింగ్ స్టార్స్' పేరుతో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా రూ.30 వేలు, పతకం, ధ్రువీకరణ పత్రం ఆమె అందుకుందని ఎంఈఓ శ్రీనివాస్ తెలిపారు. పి.కొట్టం జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివిన ఈమె పదో తరగతిలో 577 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 'షైనింగ్ స్టార్'గా ఎంపికైంది. తల్లిదండ్రులు కూనిశెట్టి జయమణి, నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు ఎం. శ్రీనివాస్, నాయకులు షేక్ నవాబ్ జానీ తదితరులు యమున అభినందించారు. ఏఐ విభాగంలో సాఫ్ట్‌వేర్ కొలువు సాధించడమే తన లక్ష్యమని ఆమె పేర్కొంది.

## అమరాపురం మండలంలో మెగా జాబ్ మేళా



**మడకశిర జూన్30( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** అమరాపురం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు పలువురు నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు. ఈ జాబ్ మేళాకు 10 బహుళ జాతి కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. సెలెక్ట్ అయిన యువతీ యువకులకు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి నియామక పత్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## రెవెన్యూ కార్యాలయం నీ ముట్టడించిన రైతులు



**కళ్యాణదుర్గం జూన్30( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కుందుర్పి ఎత్తిపోతల పథకం (జీడిపల్లి, బీటీపీ) కోసం 2018లో తమ 1400 ఎకరాల భూములను ఇచ్చిన భూ నిర్వాసితులు మంగళవారం కుందుర్పి రెవెన్యూ కార్యాలయాన్ని ముట్టడించారు. ఎనిమిదేళ్లు గడిచినా ప్రభుత్వం తమకు నష్టపరిహారం చెల్లించలేదని, సాగు భూములు కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు వెంటనే న్యాయం చేసి నష్టపరిహారం అందజేయాలని వారు డిమాండ్ చేశారు.

## చెల్లిని కాపాడి.. కాలువలో కొట్టుకుపోయిన అన్న: విజయవాడలో విషాదం



**విజయవాడ , జూన్30( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** విజయవాడ ఫకీర్ గూడెం ప్రాంతంలో ఒక అత్యంత విషాదకర ఘటన చోటుచేసుకుంది. స్థానిక బందరు కాలువ వద్ద ఆడుకుంటున్న ఒక చిన్నారి ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయింది. ప్రాణాపాయంలో ఉన్న చెల్లిని చూసి చలించిపోయిన అన్న షబ్బీర్, ఆమెను కాపాడేందుకు ఏమాత్రం ఆలోచించకుండా కాలువలోకి దూకాడు. తీవ్రంగా శ్రమించి, చెల్లిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చడంలో షబ్బీర్ సఫలమయ్యాడు. అయితే, కాలువలో ప్రవాహం బలంగా ఉండటంతో అతడు ఒడ్డుకు రాలేకపోయాడు. చూస్తుండగానే నీటి ఉధృతికి షబ్బీర్ ప్రవాహంలో కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. స్థానికులు, రెస్క్యూ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ, అప్పటికే షబ్బీర్ మృతి చెందాడు. కళ్లెదుటే అన్న ప్రాణాలు కోల్పోవడంతో ఆ కుటుంబంలో ఆక్రందనలు మిన్నంటాయి. చెల్లి ప్రాణాలు కాపాడి, తను అనంతలోకాలకు వెళ్లిన షబ్బీర్ ఉదంతం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అడవిరావులపాడు జగన్ అన్న కాలనీలో దోమల దండయాత్ర...!



**నందిగామ జూన్30( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** అడవిరావులపాడు గ్రామంలోని జగన్ అన్న కాలనీలో ఉన్న మురుగు నీటి గుంత స్థానికులకు ఇబ్బందిగా మారింది. గుంతలో నీరు నిల్వ ఉండటంతో దోమలు విపరీతంగా పెరిగి కాలనీవాసులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. గుంత పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో స్థానికులు పారిశుధ్య సమస్యలతో పాటు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం సమీపిస్తుండటంతో గుంతలో మరింత నీరు చేరి పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశం ఉందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు, వృద్ధులు అంటువ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోతున్నారు. వెంటనే స్పందించి గుంతను మట్టితో పూడ్చి పారిశుధ్య సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## విజయవాడ బైపాస్‌పై కబళించిన మృత్యువు..

### తల్లీకుమారుడి సహా ముగ్గురి దుర్మరణం



**గన్నవరం జూన్30( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** విజయవాడ కొత్త బైపాస్‌పై బీబీ గూడెం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. విజయవాడ (ఎఅయిఝుఝుఝు చీవఘం) నుంచి ఏలూరు వైపునకు వెళ్తున్న కంటైనర్ లారీ పంక్చరై అదుపుతప్పి ముందు వెళ్తున్న కారు, ఆయిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. దీంతో ఆయిల్ ట్యాంకర్.. ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతిచెందగా, మరొకరికి గాయాలయ్యాయి. కారులో ఉన్న ఇద్దరు, బైక్‌పై వెళ్తున్న ఒకరు మృతిచెందారు. గన్నవరం పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కారులో మృతిచెందిన వారిని కైకలూరు మండలం పెంచికలమర్రుకు చెందిన తల్లి జయమంగళ నాగదుర్గ (28), ఆమె కుమారుడు కారుణ్య నాగసాయి (3)గా గుర్తించారు. నాగదుర్గ భర్త విజయ్‌కుమార్‌కు గాయాలయ్యాయి. బైక్‌పై వెళ్తూ మృత్యువాత పడిన వ్యక్తిని సింగ్‌నగర్‌కు చెందిన దాసరి వెంకటేశ్వరరావు (50)గా గుర్తించారు. ప్రమాద తీవ్రతకు కారు పూర్తిగా ధ్వంసమైంది. జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్ కాకుండా ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తొలగించారు. మృతదేహాలను గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## తాళ్లూరు మండలంలోని విద్యుత్ స్టేషన్‌లో ట్రయల్ రన్

**తాళ్లూరు జూన్30( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మండలంలోని గుంటిగంగ సమీపాన నిర్మించిన 132/33 కేవీ పవర్ విద్యుత్ స్టేషన్ మంగళవారం ట్రయల్ రన్ చేపట్టారు. వివిధ ఫీడర్లలో, లైన్‌లకు విద్యుత్ సరఫరా చేసి పరిశీలించారు. ఏపీ ట్రాన్స్‌కో విజయవాడ ఎస్ఈ భాగ్యరాజు స్వయంగా పరిశీలించారు. మిగిలిన అతి స్వల్ప పనులను మరో వారం పది రోజుల్లో పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ఇది ఉపయోగంలోకి తీసుకొస్తే తాళ్లూరు, ముండ్లమూరు, దర్శి, చీమకుర్తి మండలాల్లోని 12 విద్యుత్ ఉప కేంద్రాలకు నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేసేందుకు వీలుంటుంది. ఎస్ఈ మోహన్ రావు, ఏడీఈ రామాంజనేయులు, ఇతర అధికారులు, సిబ్బంది, గుత్తేదారు సంస్థ నిర్వాహకులు పాల్గొన్నారు.

## కంచికచర్లలోని డ్రైనేజీ దెబ్బకు మోడల్ కాలనీ విలవిల...!



**నందిగామ జూన్30( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కంచికచర్లలోని మోడల్ కాలనీ చర్చి రోడ్‌లో డ్రైనేజీ సమస్య రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. డ్రైనేజీ నీరు రోడ్డుపైకి చేరి నిల్వ ఉండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై మురుగు నీరు నిలిచిపోవడంతో పాదచారులు, వాహనదారులు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. కాలనీలో నివసించే ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలన్నా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి నెలకొంది. నిల్వ ఉన్న మురుగు నీటితో దోమలు విపరీతంగా పెరిగి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు, వృద్ధులు అనారోగ్య సమస్యల బారిన పడే అవకాశం ఉందని చెబుతున్నారు. సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని వాపోతున్నారు. వర్షాలు కురిస్తే పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీ వ్యవస్థను సరిచేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

## వృషభాలను అలంకరించి, అభిమానాన్ని చాటుకుని!



**విడపనకల్లు జూన్30( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** వృషభాలను అలంకరించి, తమ నాయకులపై ఉన్న అభిమానాన్ని రైతులు చాటుకున్నారు. అనంతపురం జిల్లా విడపనకల్లు మండలంలోని ఆయా గ్రామాలలో ఏరువాక పౌర్ణమిని రైతులు ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా సోమవారం సాయంత్రం చీకలగురికీలో ఎద్దులకు పరుగు పందేలను చేపట్టారు. ఎద్దుల కొమ్ములకు రంగులు పూసి, అందంగా అలంకరించారు. పలువురు రైతులు వాటి కొమ్ముల మధ్య అభిమాన నాయకులైన ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సోదరుల చిత్రపటాలతో పాటు సినీ కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ చిత్రపటాలను, తెదేపా జెండాలను ప్రదర్శించారు. ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బాణాసంచాను పేల్చుతూ, తప్పెట్ల శబ్దాల మధ్య గ్రామంలో వృషభాలను ప్రదర్శించారు. ఆ తర్వాత గ్రామంలో ప్రధాన వీధుల్లో వాటిని భారీ జన సందోహం మధ్య పరుగు పందేలను నిర్వహించి, విజేతలగా నిలిచిన వాటిని గ్రామంలో ప్రత్యేకంగా ఊరేగించారు. అలాగే పాల్తూరు, హావలిగి గ్రామాలలో కూడా ఈ వేడుకలు చేపట్టారు. అంతక ముందు ఉదయాన్నే ఎద్దులకు స్నానాలు చేయించి కొమ్ములకు రంగులు కొట్టి, పూలమాలలతో వాటిని అలంకరించారు. ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## కార్మికుల పిల్లలకు ఉచిత ఆన్‌లైన్ నైపుణ్య శిక్షణ



**గుంటూరు జూన్30( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మికశాఖ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు సభ్యత్వ కార్డు కలిగిన కార్మికుల పిల్లల కోసం 'ఇండస్ట్రీ రెడీ ఆన్‌లైన్ స్కిల్ అప్‌గ్రేడేషన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్' గుంటూరులో ప్రారంభమైందని కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ ఆశారాణీ తెలిపారు. ఆరండల్ పేటలోని కార్మిక శాఖ కార్యాలయంలో మంగళవారం శిక్షణ బ్రోచర్‌ను విడుదల చేశారు. కార్మికుల పిల్లలు ఉచిత శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉప కమిషనర్ గాయత్రి దేవి మాట్లాడుతూ.. డిప్లొమా, డిగ్రీ, బీటెక్, మెడికల్ కోర్సులు చదువుతున్న భవన నిర్మాణ కార్మికుల పిల్లలు ఈ ఉచిత శిక్షణ కార్యక్రమంలో నమోదు చేసుకుని ప్రయోజనం పొందాలని కోరారు. ప్రీ-రికార్డెడ్ వీడియోల రూపంలో అందించే ఈ కోర్సులను విద్యార్థులు తమకు అనుకూలమైన సమయంలో ఇంటి నుంచే మొబైల్ ద్వారా అభ్యసించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏసీఎల్‌లు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్, శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి: చిర్రి బాలరాజు



**బుట్టాయగూడెం జూన్30( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రాష్ట్రంలో రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పేర్కొన్నారు. బుట్టాయగూడెం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించిన 'రైతన్నా మీ కోసం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోమాతకు పూజ చేశారు. రైతులకు వరి విత్తనాలు, పశుపోషకులకు యాభై శాతం రాయితీపై పశు దాణా పంపిణీని చేశారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రైతులను తీవ్ర నిర్లక్ష్యం చేసి గాలికి వదిలేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు అనేక సంక్షేమాభివృద్ధి కార్యక్రమాల అమలుతో వెన్నుదన్నుగా నిలుస్తోందన్నారు. వ్యవసాయ, పశు సంవర్ధక శాఖల ఏడీలు బుజ్జిబాబు, రమణయ్య, ఏవో బాలాజీ, ఏఎంసీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లు పొట్టా రామారావు, కొండేపాటి రామకృష్ణ, ఆర్డీవో రమణ, తహసీల్దారు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదామును తనిఖీ చేసిన కలెక్టర్



**రాయచోటి జూన్30( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రాయచోటిలోని మార్కెట్ యార్డ్‌లో ఉన్న ఈవీఎం గోదామును జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మాసవారీ నిఘాలో భాగంగా యంత్రాల భద్రత, బీయూ, సీయూ, వీవీ ప్యాట్‌లను పరిశీలించారు. గోదాము వద్ద 24/7 పటిష్ట నిఘా కొనసాగించాలని అధికారులకు సూచించారు. పార్టీ ప్రతినిధులు లేవనెత్తిన సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు.

## స్టార్‌డమ్ వచ్చేలోపే ఇలాంటి గొడవలా?



'రాజు వెడ్స్ రాంబాయి' సినిమాతో ఇప్పుడిప్పుడే పాపులారిటీ తెచ్చుకుంటున్న యంగ్ హీరో అఖిల్ రాజ్ ఒక సామాన్య డెలివరీ బాయ్‌తో గొడవ పడటం సోషల్ మీడియాలో కాంట్రవర్సీగా మారుతున్న విషయం తెలిసిందే. అయితే కెరీర్ స్టార్టింగ్ లోనే ఇలాంటి వివాదాల్లో ఇరుక్కుంటే మొదటికే మోసం వస్తుంది. ఎంత కష్టపడి పైకి వచ్చినా, ప్రజల్లో ఉండే ఇమేజ్ ఒక్కసారి నెగటివ్‌గా మారితే ఆ ఇంపాక్ట్ నుండి బయటపడటం చాలా కష్టం. వైరల్ అవుతున్న వీడియోలో హీరో సదరు వ్యక్తిపై నటుడు కోపంగా దూసుకురావడం స్పష్టంగా కనిపిస్తోంది. ఒక సెలబ్రెటీగా సామాన్య ప్రజలతో ఎంత స్నేహపూర్వకంగా ఉంటే కెరీర్‌కు అంత పాజిటివ్ ప్లస్ అవుతుంది. పొరపాట్లు ఎవరికైనా జరుగుతుంటాయి, కానీ వాటిని డీల్ చేసే విధానంలోనే ఒక నటుడి మెచ్యూరిటీ కనిపిస్తుంది. ఆన్లైన్ లో ఒకసారి బ్యాడ్ నేమ్ వస్తే ఆ మచ్చను చెరిపేసుకోవడం అంత తేలికైన విషయం కాదు. అఖిల్ రాజ్ ఇండస్ట్రీలో ఇప్పుడిప్పుడే ఒక మంచి పొజిషన్‌కు చేరుకుంటున్నారు. ఇంటర్ పూర్తి కాగానే ఫోటోగ్రాఫర్‌గా, యాంకర్‌గా కెరీర్ స్టార్ట్ చేసి షార్ట్ ఫీలిమ్స్ చేశారు. గతేడాది కేవలం రెండున్నర కోట్ల బడ్జెట్‌తో వచ్చి బాక్సాఫీస్ వద్ద పెద్ద విజయం సాధించిన రాజు వెడ్స్ రాంబాయి సినిమా జీవితాన్ని మార్చేసింది. ఆ క్యారెక్టర్ కోసం ఎంతో కష్టపడి డప్పు కొట్టడం నేర్చుకున్న అఖిల్ శ్రమను అందరూ మెచ్చుకున్నారు. ప్రస్తుతం పెద్ద బ్యానర్‌లో కూడా మంచి అవకాశాలు వస్తున్నాయి. అయితే ఈ ఘటనలో అసలు నిజం ఏంటి, అబద్ధం ఏంటి అనేదానిపై పూర్తి క్లారిటీ రావాల్సి ఉంది. ఇలాంటి ఇష్యూస్ ను కేవలం సోషల్ మీడియా ట్రోలింగ్ వరకే పరిమితం చేయకుండా ఇరువర్గాలు కూర్చొని సార్ట్ అవుట్ చేసుకుంటేనే అందరికీ మంచిది. ఈ గొడవను ఎంత పెద్దది చేస్తే హీరో కెరీర్‌కు అంత డ్యామేజ్ జరుగుతుంది. తప్పు ఎవరి వైపు ఉన్నా సరే, కూల్‌గా కూర్చొని మాట్లాడి సమస్యను ఇక్కడితో ముగించేయడమే బెస్ట్ ఆప్షన్ అని మరికొందరు నెటిజన్లు చెబుతున్నారు.

## విశ్వంభర కోసం చిరు మళ్లీ దిగుతాడా?



మెగాస్టార్ చిరంజీవి కెరీర్లో అనౌన్స్‌మెంట్లోనే అత్యంత క్రేజ్ తెచ్చుకున్న చిత్రాల్లో విశ్వంభర ఒకటి. 'బింబిసార' లాంటి బ్లాక్ బస్టర్ ఇచ్చిన దర్శకుడు వశిష్ఠ.. యువి క్రియేషన్స్ లాంటి పెద్ద బేనర్.. 'జగదేక వీరుడు అతిలోక సుందరి' సినిమాను గుర్తు చేసే ఫాంటసీ జానర్.. ఇలా సినిమా మొదలైనపుడు ప్రతి విషయం ఎంతో క్యూరియాసిటీ పెంచాయి. కానీ ఈ సినిమా టీజర్ లాంచ్ అయ్యాక మొత్తం మారిపోయింది. అందులో విజువల్స్ అంచనాలకు తగ్గట్లు లేకపోవడంతో సోషల్ మీడియాలో విపరీతమైన ట్రోలింగ్ జరిగింది. దీంతో టీం ఆత్మరక్షణలో పడిపోయింది. విజువల్ ఎఫెక్ట్స్ మీద మళ్లీ పని చేయడం మొదలుపెట్టడంతో సినిమా విపరీతంగా ఆలస్యం అయింది. మొదలైన మూడేళ్లకు కూడా విడుదలకు నోచుకోవట్లేదు. ఐతే ఈ సినిమా షూటింగ్ అయితే ఏడాది కిందటే పూర్తయినట్లు వార్తలు వచ్చాయి. కానీ విజువల్ ఎఫెక్ట్స్ మీద మళ్లీ పని చేయడం, పూర్తి సంతృప్తి వచ్చే వరకు రాజీ పడకూడదని నిర్ణయించు కోవడం తోనే సినిమా ఇంత ఆలస్యం అవుతోంది. వీఎఫెక్స్ కంటెంట్ పక్కాగా రెడీ అయితేనే రిలీజ్ డేట్ అనౌన్స్ చేస్తారని భావిస్తున్నారు. ఇలాంటి టైంలో మళ్లీ విశ్వంభర షూటింగ్ అంటూ వార్తలు వస్తుండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. విజువల్ ఎఫెక్ట్స్ పనులు దాదాపుగా పూర్తయ్యాయని.. కానీ ఆ కంటెంట్‌కు మ్యాచ్ అయ్యేలా కొత్తగా ఈ సినిమాలో ఒక ఎపిసోడ్‌ను జోడించాల్సి ఉందని.. అందుకోసం మళ్లీ కొన్ని ఒక షెడ్యూల్ ప్లాన్ చేస్తున్నారని సమాచారం. ఇందుకోసం చిరు అటు ఇటుగా ఒక వారం రోజులు కేటాయించాల్సి ఉందట. ప్రస్తుతం చిరు.. బాబీ దర్శకత్వంలో సినిమా కోసం పని చేస్తున్నారు. ఆ సినిమా షెడ్యూల్స్‌కు ఇబ్బంది రాకుండా విశ్వంభర కోసం కొన్ని రోజులు కేటాయించాలని చూస్తున్నారట. ఆ ఎపిసోడ్ చిత్రీకరణ పూర్తి చేసి, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసి దసరాకు విశ్వంభరను ప్రేక్షకుల ముందుకు తేవాలని దర్శక నిర్మాతలు ఆలోచిస్తున్నట్లు సమాచారం.

## ఇద్దరు టైమింగ్ హీరోలు కలిసి నటిస్తే



మాస్ హీరోయిజంలో కామెడీ మిక్స్ చేసి మెప్పించడంలో రవితేజకు సాటి రావడం అంత ఈజీ కాదు. తన ముద్రని మ్యాచ్ చేయాలంటే చాలా కష్టపడాలి. చిన్న చిన్న మాటలు వాడి ఒక డిఫరెంట్ స్టయిల్ తో ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో శ్రీవిష్ణుది విలక్షణమైన శైలి. ఈ ఇద్దరూ కలిసి నటిస్తే ఎలా ఉంటుందో వేరే చెప్పాలా. రాజరాజ చోర -- స్వాగ్ ఫేమ్ హసిత్ గోలి దర్శకత్వంలో దిల్ రాజు నిర్మించబోయే మూవీలో ఈ కాంబినేషన్ సెట్ అయిపోయిందని ఫిలిం నగర్ టాక్. త్వరలోనే ఇది సెట్స్ పైకి వెళుతుందని సమాచారం. దీని స్టోరీ లైన్, రవితేజ వేయబోయే పాత్ర గురించి ఆ మధ్య సోషల్ మీడియాలో కొన్ని పుకార్లు చక్కర్లు కొట్టాయి కానీ అవేవి నిజం కాదట. 2027 సంక్రాంతి విడుదలని టార్గెట్ చేసుకుని ఈ సినిమా రూపొందిస్తారని తెలిసింది. అవుట్ అండ్ అవుట్ ఎంటర్ టైన్మెంట్ తో పాటు చిన్న కమర్షియల్ టచ్ తో కూడిన మెసేజ్ చాలా బలంగా ఉంటుందని ఇన్ సైడ్ న్యూస్. ముఖ్యంగా ఈ కాంబోలో పూయించే నవ్వులు ఓ రేంజ్ లో ఉంటాయట. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. రవితేజ ఇరుముడి చివరి దశ షూటింగ్ లో ఉన్నారు. ఇది ఆగస్ట్ 21 విడుదలయ్యేలోపు హసిత్ గోలి సెట్స్ లో అడుగు పెట్టొచ్చు. ఇది కాకుండా వివేక్ ఆత్రేయ డైరెక్షన్లో చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు టాక్ ఉంది. ఇరుముడి తీస్తున్న మైత్రి మూవీ మేకర్సే నిర్మాతగా వ్యవహరించడానికి అవకాశాలున్నాయి. ఏ మాత్రం గ్యాప్ ఇవ్వకుండా వరసగా సినిమాలు చేసేలా మాస్ రాజా రవితేజ ప్లానింగ్ మాములుగా లేదు. ఇక శ్రీవిష్ణు విషయానికి వస్తే 2026 తనకు అంతగా కలిసి రాలేదు. విష్ణు విన్యాసం, మృత్యుంజయ్ నిరాశ పరచగా స్పెషల్ క్యామియో చేసిన గాయపడ్డ సింహం దారుణంగా పోయింది. ఓ రెండు నిముషాలు కనిపించిన నారి నారి నడుమ మురారి ఒకటే హిట్ అయ్యింది. అందుకే ఆశలన్నీ రాబోయే కామ్రేడ్ కళ్యాణ్ మీద పెట్టుకున్నాడు. ఆల్రెడీ ప్రమోషన్లు మొదలుపెట్టేశారు. దీంతో ట్రాక్ లోకి వస్తాననే నమ్మకం శ్రీవిష్ణులో వ్యక్తమవుతోంది. సితార బ్యానర్ లో మరో సినిమా నిర్మాణంలో ఉంది.




## శుభాకాంక్షలు సరే... శుభవార్త ఎక్కడ



ఇవాళ అల్లరి నరేష్ పుట్టినరోజు. ఆయనతో సినిమాలు చేస్తున్న నిర్మాణ సంస్థలు ఒక్కొక్కటిగా గ్రీటింగ్స్ చెబుతూ సోషల్ మీడియాలో కొత్త పోస్టర్లు విడుదల చేస్తున్నాయి. సెప్టెంబర్ 4 'రంభ ఊర్వశి మేనక' వస్తుందని అధికారికంగా ప్రకటించారు. అయితే మన టాపిక్ అది కాదు. అల్లరి నరేష్ హీరోగా రూపొందిన 'ఆల్కహాల్' ఎప్పుడో షూటింగ్ పూర్తి చేసుకుంది. గత ఏడాది టీజర్ తో పాటుగా 2026 జనవరి 1 మూవీ రిలీజ్ ఉంటుందని సితార ఎంటర్ టైన్మెంట్స్ అఫీషియల్ గా అనౌన్స్ మెంట్ ఇచ్చింది.


అంతే ఆ తర్వాత ఉలుకు పలుకు లేదు. ఆల్కహాల్ టీజర్ వచ్చి 9 నెలలు దాటేసింది. ఇప్పటి దాకా రిలీజ్ డేట్ ఎప్పుడో చెప్పలేదు. తాజాగా వదిలిన కొత్త పిక్ లో హీరోకి శుభాకాంక్షలు చెప్పారు కానీ అసలైన శుభవార్త మాత్రం అందులో లేదు. మెహర్ తేజ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రుహాని శర్మ, నీహారిక ఎన్ఎం హీరోయిన్లు కాగా సత్య తదితరులు ఇతర ముఖ్యపాత్రలు పోషించారు. గిబ్రాన్ సంగీతం అందించడం లాంటి బలమైన టెక్నికల్ టీమ్ ఈ చిత్రానికి పని చేసింది. కంటెంట్ విషయంలో ఏదైనా జాప్యం జరుగుతోందో లేక ఓటిటి డీల్ లాంటి చిక్కులు ఏమైనా ఏర్పడ్డాయో తెలియదు కానీ ఆల్కహాల్ పేరుకి తగ్గట్టే ఒక వర్గం మూవీ లవర్స్ అటెన్షన్ అయితే లాగింది. మందు అలవాటు లేని ఒక యువకుడి జీవితంలో జరిగిన సంఘటనలను ఆధారంగా చేసుకుని ఈ సినిమా తీశారట. టీజర్ లో అదే హైలైట్ చేశారు. ఇంత వెరైటీ కాన్సెప్ట్ తీసుకున్నారు కాబట్టి ప్రెజెంటేషన్ కూడా అదే స్థాయిలో ఉంటే జనాలకు కనెక్ట్ కావొచ్చు.. ఇంతకీ ఆల్కహాల్ ని థియేటర్ రిలీజ్ చేసే ఉద్దేశంలో నిర్మాత నాగవంశీ ఉన్నారో లేదో అంతు చిక్కడం లేదు. ఇదే బ్యానర్ లో గౌతమ్ తిన్ననూరి తీసిన 'మ్యాజిక్' కూడా ఇదే తరహాలో మోక్షం కోసం ఎదురు చూస్తోంది. ఇంత అగ్ర నిర్మాణ సంస్థ నుంచి పేరున్న హీరోల సినిమాలే ఇలా రిలీజ్ గుమ్మం దగ్గర ఆగిపోవడం విచిత్రమైన విషయం. బడ్జెట్ ఇష్యూస్, బిజినెస్ సమస్యలు లేని ఇలాంటి వాటికి ఆటంకాలు ఎదురు కావడమంటే సంథింగ్ ఫీషి అనుకోవాలి. అదేంటో మరి.



# బిజినెస్ న్యూస్



## ఇక నంబర్ కనిపించదు.. యూజర్ నేమ్ రిజర్వ్ చేసుకోండి: వాట్సప్




వాట్సప్ యూజర్ల కోసం టెక్ సంస్థ మెటా మరో కొత్త ఫీచర్‌ను తీసుకువచ్చింది. వినియోగదారుల ప్రైవసీని కాపాడేందుకు కొత్తగా యూజర్‌నేమ్ ను అందుబాటులోకి తెచ్చింది. దీంతో ఫోన్ నంబర్‌ను ఎవరికీ షేర్ చేయకుండానే ప్రత్యామ్నాయమార్గంగా యూజర్‌నేమ్‌తో చాట్ చేసేందుకు వీలుకలగనుంది. ఈ ఏడాది చివర్లో విస్తృతస్థాయిలో ఈ ఫీచర్ అందుబాటులోకి రానుందని మెటా ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ నేపథ్యంలో యూజర్‌నేమ్‌లను రిజర్వ్ చేసుకొనే ఆప్షన్‌ను ప్రారంభించింది. ఆర్థిక, వ్యక్తిగత అంశాల్లో ఫోన్ నంబర్ అత్యంత కీలకం. దానిని కొత్తవారితో షేర్ చేసుకోవాల్సి వచ్చినప్పుడు కొంత తటపటాయిస్తుంటాం. ఈ ఇబ్బందిని తొలగించి, యూజర్ ప్రైవసీని కాపాడేందుకు వాట్సప్ ఈ ఫీచర్‌ను తీసుకువచ్చింది. దీంతో నంబర్ షేర్ చేయకుండానే యూజర్ నేమ్‌తో ఇతరులతో కాంటాక్ట్ అవ్వొచ్చు. ఒక వ్యక్తిని తొలిసారి కాంటాక్ట్ చేయాలంటే యూజర్ నేమ్ తెలిసి ఉండాల్సిందేనని వాట్సప్ వైస్ ప్రెసిడెంట్ (ప్రొడక్ట్) అలిస్ న్యూటన్ వెల్లడించారు. ఈ కొత్త ఫీచర్ అందుబాటులోకి వచ్చినా.. ప్రైవసీ కోసం ఇప్పటికే ఉన్న బ్లాక్, సైలెన్సింగ్ అన్‌నోన్ కాలర్స్ వంటి నియంత్రణలు కొనసాగుతాయని చెప్పారు. ఇక రిజర్వ్ చేసుకోవాలనుకున్న యూజర్ నేమ్ మూడు నుంచి 35 అక్షరాల పొడవు ఉండొచ్చు. ఇందులో ఖ-ఓ, 0-9, డాట్, అండర్ స్కోర్ మాత్రమే వాడాల్సి ఉంటుంది. ఖఖ, చివర్లో .ఖీఎ, .అవ్ వంటివి ఉపయోగించకూడదు. అదనంగా 4 అంకెలతో యూజర్ నేమ్ కీ కూడా సెట్ చేసుకోవచ్చు. దీనివల్ల ఎవరైనా మిమ్మల్ని మొదటిసారి కాంటాక్ట్ చేయాలంటే వారికి మీ యూజర్ నేమ్‌తో పాటు ఆ కీ కూడా షేర్ చేయాల్సి ఉంటుంది. ఇన్‌స్టా, ఫేస్‌బుక్ ఖాతాలున్న క్రియేటర్లు, వ్యాపార సంస్థలు వంటివి ఇప్పుడున్నవాటికి మ్యాచ్ అయ్యేలా యూజర్ నేమ్ పొందేందుకు సంస్థ వీలు కల్పిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక వినియోగదారులున్న మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సప్ ఐరోపా, ఆసియా, ఇతర ప్రాంతాల్లో దీని వినియోగం పెరుగుతూ వస్తోంది. ఇలాంటి సమయంలో కట్టుదిట్ట గోప్యతకు డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే యూజర్ నేమ్ ఫీచర్ గురించి ప్రకటన చేసింది. ప్రస్తుతానికి ఈ ఫీచర్ పరిమిత సంఖ్యలో వినియోగదారులకు మాత్రమే అందుబాటులో ఉంది. వాట్సప్ ప్రొఫైల్ సెట్టింగ్స్‌లోకి వెళ్లి అక్కడ యూజర్ నేమ్ సెట్ చేసుకునే ఆప్షన్ ఉందో లేదో చూడొచ్చు. లేకపోతే రాబోయే కొన్ని రోజుల్లో మీకు ఈ అప్‌డేట్ పొందే అవకాశం ఉంటుంది.

## స్మార్ట్‌ఫోన్ సెగ్మెంట్‌లోకి ఫైర్-బోల్ట్ ఎంట్రీ



స్మార్ట్‌వాచ్‌లు, వేరియబుల్స్‌ను తయారు చేసే భారత కంపెనీ ఫైర్-బోల్ట్ స్మార్ట్‌ఫోన్ సెగ్మెంట్‌లోకి ఎంట్రీ ఇస్తోంది. రూ.10 వేల నుంచి రూ.15వేల ధర లోపే ఫోన్లను విడుదల చేసేందుకు సిద్ధమవుతోంది. ఇందుకోసం కొన్ని నెలలకు అవసరమైన సరఫరా చైన్ కోసం 50 మిలియన్ డాలర్లకు (దాదాపు రూ.475 కోట్లు) పైగా పెట్టుబడులు పెట్టనుందని కంపెనీ వ్యవస్థాపకుడు అర్నవ్ కిశోర్ వెల్లడించారు. "ఏఐ కారణంగా మెమొరీ చిప్‌ల ధరలు పెరిగాయి. ప్రస్తుతం బడ్జెట్ సెగ్మెంట్‌లో స్మార్ట్‌ఫోన్లు దొరకడం కష్టంగా మారింది. ఈ లోటును పూడ్చేందుకు మేం వస్తున్నాం. కస్టమర్లకు అందుబాటులో ఉండేలా రూ.10 వేల నుంచి రూ.15 వేలలోపే బోల్ట్ ఓఎస్‌తో ఫోన్లను తీసుకొస్తాం. ఆగస్టు కంటే ముందే 4జీ ఫోన్లను, ఆ తర్వాత 5జీ ఫోన్లను లాంచ్ చేస్తాం. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ వేదికగా విక్రయిస్తాం" అని అర్నవ్ తెలిపారు. ప్రీమియం సెగ్మెంట్ వైపు ఎక్కువ లాభదాయకత ఉండటంతో చైనా కంపెనీలు అటువైపు మళ్లుతున్నాయని అర్నవ్ అన్నారు. అందుకే కస్టమర్లకు అందుబాటు ధరల్లో భారతీయ బ్రాండ్‌ను పరిచయం చేయాలనే ఆలోచన వచ్చిందన్నారు. ఇందుకు ఆగస్టు వేదిక కానుందని తెలిపారు. ఈ మేరకు తొలుత పది లక్షల ఫోన్లను విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం.

## రెండో రోజూ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్ సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు రెండో రోజూ నష్టాల్లో ముగిశాయి. ముఖ్యంగా ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ వంటి ఐటీ స్టాక్స్‌లో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. మరోవైపు దోహా వేదికగా ఇరాన్-అమెరికా మధ్య శాంతి చర్చలు జరగనున్న నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు మాత్రం రాణించాయి. సెన్సెక్స్ 249 పాయింట్లు కోల్పోగా.. నిఫ్టీ 80 పాయింట్లు నష్టపోయింది. సెన్సెక్స్ ఉదయం 77,005.51 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,728.37) నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 77,037.36 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. 76,329.39 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 249.70 పాయింట్ల నష్టంతో 76,478.67 వద్ద ముగిసింది. నిఫ్టీ 80.50 కోల్పోయి 23,865.75 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో మారుతీ, టైటాన్, బజాజ్ ఫైనాన్స్, ఎటర్నెల్, అదానీ పోర్ట్స్, భారతీ ఎయిర్‌టెల్ లాభపడ్డాయి. ఐటీసీ, హిందుస్థాన్‌లీవర్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్, టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లు నష్టాలు చవిచూశాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 94.66గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 74.21 డాలర్లుగా ఉండగా.. బంగారం ఔన్సు 4,025.73 వద్ద కొనసాగుతోంది.

## కరుగుతోన్న పసిడి కాంతులకు కారణాలు ఇవే..



గడిచిన కొన్ని నెలలుగా రికార్డు స్థాయిలకు చేరుకుంటూ సామాన్యులకు చుక్కలు చూపించిన పసిడి ధరలు, ఇటీవల అనూహ్యంగా కిందికి దిగివస్తున్నాయి. ఈ రోజు (జూన్ 30, 2026) హైదరాబాద్‌తో పాటు దేశంలోని ప్రధాన నగరాల్లో 24 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు సుమారు రూ.1,40,000 మార్కు వద్ద ట్రేడ్ అవుతుండగా, 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర సుమారు రూ.1,29,000 స్థాయికి దిగివచ్చింది. గత వారంతో పోలిస్తే ఇది భారీ పతనమనే చెప్పాలి. ఈ ఆకస్మిక మార్పునకు గల ఆర్థిక కారణాలు, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు, భవిష్యత్తులో బంగారంపై రాబడులు అందుకోవడానికి అనుసరించాల్సిన వ్యూహాలపై విశ్లేషణాత్మక కథనం మీకోసం.

ధరలు తగ్గడానికి ప్రధాన కారణాలు

పసిడి మార్కెట్ ఒడిదుడుకులను గమనిస్తే ప్రస్తుతం మూడు ప్రధానాంశాలు ఈ పతనానికి కారణమవుతున్నట్లు స్పష్టమవుతోంది.

1. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వైఖరి

అమెరికా కేంద్రీయ బ్యాంక్ (యూఎస్ ఫెడరల్ రిజర్వ్) వడ్డీ రేట్లను తగ్గిస్తుందని ఈ ఏడాది ఆరంభంలో అంచనా వేసినప్పటికీ తాజా పాలసీ సమావేశంలో వడ్డీ రేట్ల తగ్గింపును 2027కు వాయిదా వేసింది. అంతేకాకుండా, ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి వడ్డీ రేట్ల పెంపు ఉండొచ్చనే సంకేతాలు ఇచ్చింది. వడ్డీ రేట్లు పెరిగితే బాండ్లు, ఇతర స్థిర ఆదాయ వనరులపై రాబడి పెరుగుతుంది. దీంతో వడ్డీ లేదా డివిడెండ్ ఇవ్వని బంగారం వైపు నుంచి ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారు.

2. బలపడుతున్న అమెరికన్ డాలర్, బాండ్ ఈల్డ్స్

ఫెడ్ నిర్ణయాలతో అంతర్జాతీయ మార్కెట్‌లో యూఎస్ డాలర్ ఇండెక్స్ ఏడాది కాలంలోనే గరిష్ట స్థాయికి చేరుకుంది. సాధారణంగా డాలర్ బలపడితే ఇతర కరెన్సీలలో బంగారం కొనడం ఖరీదైనదిగా మారుతుంది. తద్వారా డిమాండ్ తగ్గి ధరలు క్షీణిస్తాయి. గ్లోబల్ గోల్డ్ ఈటీఎఫ్‌ల నుంచి, ముఖ్యంగా ఆసియా మార్కెట్ల నుంచి పెట్టుబడులు వెనక్కి వెళ్లడం దీనికి అద్దం పడుతోంది.

3. పశ్చిమాసియాలో సడలిన ఉద్రిక్తతలు

గత కొద్ది నెలల్లో బంగారం ధరలు భారీగా పెరగడానికి రష్యా-ఉక్రెయిన్, పశ్చిమాసియా (ఇరాన్-అమెరి కా/ఇజ్రాయెల్) సంక్షోభాలు ప్రధాన కారణం. అయితే ఇటీవల ఇరాన్, అమెరికాల మధ్య శాంతి చర్చల సరళి, కీలకమైన హార్ముజ్ జలసంధి పాక్షికంగా తెరచుకోవడం వంటి పరిణామాల వల్ల గ్లోబల్ మార్కెట్‌లో ముడిచమురు ధరలు దాదాపు 30% తగ్గాయి. దాంతో అంతర్జాతీయ ఒడిదొడుకులు తగ్గి సురక్షిత పెట్టుబడిగా బంగారానికి ఉన్న డిమాండ్ ప్రీమియం ఒక్కసారిగా ఆవిరైపోయింది.

భవిష్యత్తులో ఇన్వెస్ట్‌మెంట్ మార్గాలు

ప్రస్తుత ధరల తగ్గుదల అనేది దీర్ఘకాలిక ఇన్వెస్టర్లకు ఒక అవకాశంగా ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. ఎందుకంటే కేంద్ర బ్యాంకుల వద్ద డీ-డాలరైజేషన్ (డాలర్‌పై ఆధారపడటం తగ్గించడం) ప్రక్రియలో భాగంగా బంగారాన్ని నిల్వ చేసుకునే ధోరణి ఇంకా కొనసాగుతోంది. అయితే కేవలం భౌతిక బంగారం (నగలు) రూపంలో కాకుండా కొన్ని మార్గాల్లో పెట్టుబడి పెడితే మెరుగైన రాబడులు సాధించవచ్చు.

గోల్డ్ ఈటీఎఫ్‌లు: స్టాక్ మార్కెట్ ద్వారా డిజిటల్ రూపంలో బంగారం కొనుగోలు చేయడానికి ఇది ఉత్తమ మార్గం. ఇందులో ఎలాంటి మేకింగ్ ఛార్జీలు, తరుగు ఉండవు. మనకు నచ్చినప్పుడు కరెంట్ మార్కెట్ ధరకే విక్రయించుకోవచ్చు.

## మహిళల భద్రత, సైబర్ నేరాలు, రహదారి పై జాగ్రత్తలు పై అవగాహనా సదస్సు

శంకర్రావు, యస్ఐ అనంతగిరి



**అనంతగిరి, జూన్ 30 (నేటి మనదేశమ్) :** అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం కేంద్రంలో గల అనంతగిరి వారపు సంతలో శ్రీ ఎస్పీ అమిత్ బర్గర్ ఆదేశాల మేరకు మహిళా భద్రత, సైబార్ నేరాలు, రోడ్ సేఫ్టీ కార్యక్రమం కు సంబంధించి అవగాహన నిర్వహించారు ఈ కార్యక్రమంలో స్థానిక మహిళ కమిషన్ నంబర్ కృష్ణకుమారి, మరియు ఎస్సై శంకర్ రావు , సంతకు హాజరైన మహిళలు మరియు సంబంధిత ICDS సిబ్బంది మరియు పోలీసు సిబ్బంది ఈ కార్యక్రమానికి పాల్గొన్నారు




## రక్త కొరతను అధిగమించాలి

### డాక్టర్ తిరుమల ప్రసాద్

**- 20 మందికి పైల్స్, హెర్నియా ఉచిత ఆపరేషన్లు**



**(విజయనగరం) జూన్ 30 (నేటి మనదేశమ్) :** వేసవి కాలంలో ఏర్పడే రక్త కొరతను అధిగమించడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని తిరుమల మెడికవర్ ఆసుపత్రి అధినేత డాక్టర్ తిరుమల ప్రసాద్ పిలుపు నిచ్చారు. సోమవారం తిరుమల మెడికవర్ హాస్పిటల్‌లో గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు అబ్దుల్ రవూఫ్, రోటరీ బ్లడ్ బ్యాంక్ సంయుక్త సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని డాక్టర్ తిరుమల ప్రసాద్, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ బి.వి.ఎస్.ఆర్. శ్రీనివాసరావు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ తిరుమల ప్రసాద్ మాట్లా డుతూ.. 'జనరల్ సర్జన్స్ డే' పురస్కరించుకుని జూన్ 8 నుంచి 15వ తేదీ వరకు వారం రోజుల పాటు ఉచిత సర్జికల్ క్యాంప్ నిర్వహిం చినట్లు తెలిపారు. ఈ ఉచిత శిబిరంలో సుమారు 200 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా సలహాలు, సూచనలు అందజేశా మన్నారు. అందులో హెర్నియా, పైల్స్ సమస్యలతో బాధపడుతున్న 20 మంది నిరుపేద రోగులకు ఉచితంగా ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేశామని వెల్లడించారు. అలాగే ఆసుపత్రి పరిసరాల్లో తిరుమల నర్సింగ్ విద్యార్థులచే మొక్కలు నాటే కార్యక్రమాన్ని కూడా చేపట్టా మన్నారు. ఎండ తీవ్రత వల్ల వేసవిలో రక్త కొరత ఎక్కువగా ఉంటుందని, దీనిని అధిగమించేందుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు. అనంతరం రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు మాట్లా డుతూ.. తమ సంస్థ గత 69 సంవత్సరాలుగా సమాజంలో అనేక సేవా కార్యక్రమాలను అందిస్తోందని గుర్తుచేశారు. ముఖ్యంగా 2020 సంవత్సరం నుంచి బ్లడ్ బ్యాంక్ ద్వారా దాదాపు పదివేల యూనిట్ల రక్తాన్ని సేకరించి, ఆపదలో ఉన్న ఎంతోమంది ప్రాణాలను కాపాడగలిగా మని వివరించారు. ఈ కార్యక్రమంలో తిరుమల మెడికవర్ సెంట్రల్ హెడ్ నాగ పవన్, రోటరీ క్లబ్ సభ్యులు ప్రొఫెసర్ రామకృష్ణ, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### పిడుగుపాటుకు రైతు బలి

**సంతకవిటి (విజయనగరం జిల్లా) :** మిర్తివలస గ్రామంలో పిడుగుపాటుకు ఓ రైతు మృతిచెందిన ఘటన ఆదివారం విషాదాన్ని నింపింది. గ్రామానికి చెందిన పాండ్రంకి రామినాయుడు తన వ్యవసాయ పొలంలో వరి విత్తనాలు జల్లుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఆ సమయంలో అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ప్రారంభమైంది. ఇదే సమయంలో పిడుగు పడటంతో రామినాయుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఆయనతో పాటు పొలంలో పనిచేస్తున్న మరో ఇద్దరు రైతులు మాత్రం సురక్షితంగా బయటపడ్డారు.

## జగదీశ్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ విజేత లక్కీ లెవెల్స్ టీమ్




**భీమునిపట్నం జూన్ 30 (నేటి మనదేశమ్) :**
భీమిలి మండలం రాజలింగం పేట గ్రామంలో కీ. శే.బూర జగదీష్ జన్మ దినోత్సవ సందర్భంగా కుటుంబ సభ్యులు బూర రామారావు,కుమారి, ఆధ్వర్యంలో మంగళవారం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కుమారుడు బి.జగదీష్ క్రికెట్ లో మంచి ప్రావీణ్యం సాధించి అనేక టోర్నమెంట్ లో విజేతగా నిలిచి అనేక బహుమతులు అందుకుని పేరు తెచ్చుకున్నాడని, గత ఏడాది ఆటో ప్రమాదం లో అకాల మరణం చెందడంతో అతని పేరు మీద ఈ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించామని తెలిపారు.ఈ పోటీలలో విన్నర్స్ గా డెక్కతిపాలెం లక్కీ లెవెల్స్ టీమ్ కు 20,వేలు,రన్నర్స్ గా రేఖవాణిపాలెం ఎస్ ఎస్ టి రాజీవ్ టీమ్ కు10 వేలు నగదు బహుమతులు ముఖ్య అతిథిల చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో అక్రమాని రామా నాయుడు,సిహెచ్.భాస్కర్ రెడ్డి, ఏ.లోవరాజు,ఎమ్. ఆది నారాయణ రెడ్డి, డి.అప్పలరెడ్డి,బి.అప్పల నాయుడు, పి.సురేష్,బి.బాబ్జీ,బి.రాంబాబు,పి.వెంకటేష్,మరియు గ్రామ పెద్దలు,యూత్ సహాయ సహకారాలతో ఈ టోర్నమెంట్ విజయవంతంగా నిర్వహించారు.

## రూ.40 లక్షల వరకు నష్టపోయాం.. దొంగను పట్టుకోండి!



**కమలానగర్, జూన్ 30 (నేటి మనదేశమ్) :** వెల్డింగ్ దుకాణాల్లో కాపర్ తీగలను దొంగలిస్తున్న వ్యక్తిని పట్టుకోవాలని, పోలీసుల చుట్టూ తిరిగిన కనీసం స్పందిం చటం లేదని వెల్డింగ్ వ్యాపారస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇవాళ దాదాపు 50 మంది వెల్డింగ్ దుకాణాల నిర్వాహకులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా ఎస్పీని కలిసి విన్నవించు కున్నారు. అనంతపురం పట్టణం లోనూ అలాగే బుక్కరాయసముద్రం, రాప్తాడు ప్రాంతాలలో రాత్రి సమయాల్లో వెల్డింగ్ దుకాణాల్లో ఉన్న కాపర్ వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనాలు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. దొంగను పట్టుకోవాలని సీసీ ఫుటేజీలతో సహా నగరంలో ఉన్న అన్ని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు స్పందించడం లేదని వాపోయారు. జిల్లా ఎస్పీ ఇప్పటికైనా ప్రత్యేక చొరవ తీసుకొని దొంగను పట్టుకొని న్యాయం చేయాలని కోరారు. ఆరు నెలలుగా దాదాపు వెల్డింగ్ దుకాణాల నిర్వహకులు రూ.30 నుంచి రూ. 40 లక్షల వరకు నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఎస్పీ ప్రత్యేక చొరవ తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు.

## మలేరియ పై వైద్య సిబ్బంది అవగాహన



**గణపవరం (పశ్చిమ గోదావరి) జూన్ 30 (నేటి మనదేశమ్) :** మలేరియా వ్యాదికి గురికాకుండా పత్తిఒక్కరు ఇంటిపరిసరాలను శుబ్రతగా ఉంచుకోవాలని కాళిదాసు ఆరోగ్య సహయకులు నామాలరాజు సూచించారు సోమవారం స్తానిక పిహెచ్చ్ సి మండల పి ఎంపి ఆషోషియన్ ఆద్వర్యంలో స్తానికులకు మలేరియా వ్యాదాపై అవగాహన కల్పించారు దోమలను నివారించడానికి ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే పాటించాలని చెప్పారు జ్వర పీడుతులుఎవరైనా ఉంటేస్తానిక ఆసుపత్రిలో వైద్యం పోందాలని చెప్పారు. మలేరియా వ్యాదిపై ఉచితం గా రక్తపరిక్షలు చేస్తారని చెప్పారు ఈ కార్యక్రమంలో

పి ఎం పి ఆషో షియన్ జిల్లా అద్యక్షులు ఏ ఆర్ పరమేశ్వరావు ఏ ఎన్ ఎం ఏసుమ్మ మత్తి శ్రీను ఆషాలు వరలక్ష్మి క్రిష్ణ కుమారి పాల్గొన్నారు.

### రెడ్ క్రాస్ ఆసుపత్రిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి : పి జి ఆర్ ఎస్ లో ఆర్జి

**గణపవరం (పశ్చిమ గోదావరి) :** గణపవరం మండలం చినరామచంద్రపురం లో 58 2 సర్వేనెంబరుగల 60 సెట్లు నీటీపారుదల శాఖలోగలప్రభుత్వ భుమిలో ఉన్న రెడ్ క్రాస్ ఆసుపత్రిని ప్రభుత్వం స్వాదీనం చేసుకోవాలని కోరుతూ సోమవారం గణపవరం తాశీల్దార్ కార్యాలయంలో జరిగిన పి జి ఆర్ ఎస్ లో స్తానిక ఎంపిడిఓ పి సత్యనారాయణ కి అర్జి ఇచ్చినట్లు అఖిల భారత హెండూలూమ్సు మాజీ సబ్యులు నంద్యాల రామలింగరాజు ప్రముఖ దాత పోశెంశెట్టి రామూర్తి మనవడు పోశెంశెట్టి క్రిష్ణ చెప్పారు

## అల్లూరి జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన.. ఉద్రిక్తత



**పాడేరు, జూన్ 30 (నేటి మనదేశమ్) :** అల్లూరి జిల్లా కలెక్టరేట్ వద్ద హైడ్రో పవర్ ప్రాజెక్టు బాధిత గ్రామాలకు చెందిన గిరిజనులు సోమవారం నిరసన చేపట్టారు. హైడ్రో పవర్ ప్రాజెక్టుకు సంబంధించి గ్రామస్థులకు తెలియకుండానే సర్వే నిర్వహిస్న్?న్నారని ఆరోపిస్తూ మజ్జివలస ప్రాంత గిరిజన ప్రజలు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. హైడ్రో పవర్ ప్రాజెక్టు సాధన కమిటీ, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. దీనిపై జిల్లా కలెక్టర్ నిషాంతి స్పందించారు. హైడ్రో వపర్ ప్రాజెక్టుకు సంబంధించి ఎలాంటి సర్వే చేయడం లేదని స్పష్టం చేశారు. ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని.. ప్రాజెక్టు విషయంలో ఆయా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించిన తర్వాతే ముందుకు వెళ్తామని ఆమె మీడియాకు వివరించారు.

## ఏనుగుల కదలికలపై పర్యవేక్షణ

### - డిఎఫ్ ఓ సూచనలు



**మన్యం (మక్కువ) జూన్ 30 (నేటి మనదేశమ్) :** ఏనుగుల గుంపు కదలికలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని డిఎఫ్ఓ ప్రసూన అటవీ సిబ్బందికి సూచించారు. బుధవారం మండలంలోని మార్కొండ పొట్టి పంచాయతీ పరిధిలోని అటవీ సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. మండలంలో గత నాలుగు రోజులుగా ఏనుగుల గుంపు సంచరించడంతో ప్రజలు భయాందోళన చెందుతున్న విషయం తెలిసిందే. మంగళవారం రాత్రి ఏనుగుల గుంపు రైతుల పంట పొలాలను నాశనం చేయడమే కాకుండా, వ్యవసాయ ఉపకరణ వస్తువులను కూడా ధ్వంసం చేసినట్లు తెలిసింది. మార్కొండపుట్టి, ఎస్ పెద్దవలస పంచాయతీ పరిధిలో ప్రస్తుతం ఏనుగుల గుంపు ఉండటంతో నష్టాల పై అప్పుడే పరిశీలన చేయలేమనీ, ఏనుగులు వాటి దిశ మార్చిన తర్వాత నష్టాల ప్రాంతం వేస్తామన్నట్లు సిబ్బంది డి.ఎఫ్ దృష్టికి తీసుకువెళ్లినట్లు సమాచారం. గ్రామాల్లో ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేసేలా చర్యలు చేపట్టాలని సిబ్బందికి డిఎఫ్ఒ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎలిఫెంట్ మానిటరింగ్ యూనిట్ అధికారి మణికంఠేష్, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

## సాగు భూమికి పట్టాలు ఇవ్వాలని ఎమ్మార్వో కార్యాలయం ముట్టడి

**- వేపాడలో గిరిజన రైతుల పొలికేక**

**- సర్వే చేపడతాం.. ఆందోళన విరమించాలని కోరిన ఎమ్మార్వో**



**వేపాడు (విజయనగరం) జూన్ 30 (నేటి మనదేశమ్) :**సాగు భూమికి పట్టాలివ్వని ప్రభుత్వంపై రైతులు ఆందోళన బాట పట్టారు. ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో విజయనగరం జిల్లా వేపాడు మండలంలోని ఎమ్మార్వో కార్యాలయంను రైతులు ముట్టడించారు. ఈ క్రమంలో కొండగంగుపూడిలో ఉన్న అన్ని గ్రామాల నుంచి గిరిజన వెనకబడిన తరగతులకు చెందిన రైతాంగమంతా ఒక్కటై పోలీస్ స్టేషన్ నుంచి ఎమ్మార్వో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎమ్మార్వో కార్యాలయం ఎదుట బయటయించిన రైతులు ఎమ్మార్వో లేకపోవడంతో ఆర్డీఓ వచ్చి సమాధానం చెప్పే వరకు ఆందోళన విరమించేది లేదని తేగేసి చెప్పేసారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష్యుడు జగన్ మాట్లాడుతూ ... రీ సర్వేలో కూడా పట్టా ఉన్న వారికే చేస్తున్నారని 30 ఏళ్లుగా సాగులో ఉన్న భూములకు రీ సర్వే చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సాగులో ఉన్న పేద రైతులకు పట్టా ఇవ్వకపోతే, ఈ రైతులను ప్రభుత్వం ఎలా ఆదుకుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే పేదలకు పట్టాలు ఇవ్వడం లేదని అన్నారు. బంగారయ్యపేట, పాతూరు, సంఘంవలస సారవానిపాలెం గ్రామాల్లో ఉన్న అత్యధిక గిరిజనులలు ఎప్పటి నుంచో గిరిజనులు సాగులో ఉన్నా పట్టాలు ఇవ్వలేదని జగన్ డిప్యూటీ తాసిల్దారికి తెలియజేశారు. తొందరలోనే సర్వే చేపడతామని డిప్యూటీ తాసిల్దార్ తెలియజేయగా సర్వే ఎప్పటికీ పూర్తి చేస్తారో తెలియజేయాలని జగన్ కోరగా, ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి ప్రతి ఒక్కరి సాగును సర్వే చేపట్టే మూడు నెలల్లో రిపోర్టు తయారు చేసి కలెక్టర్కు నివేదిస్తామని హెచ్ డి టి తెలియజేయడంతో ఆందోళనకారులు సమ్మతించారు. మూడు నెలల్లో సర్వే రిపోర్ట్ లు పూర్తి కాకపోతే మూడు నెలల తర్వాత గ్రామం మొత్తంలో ఉన్న గిరిజనులందరినీ ఎమ్మార్వో కార్యాలయం వద్ద వంటావార్పు చేసుకుని ఇక్కడే ఉంటామని జగన్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకుడు చలమూరి శ్యామ్, సుకురు గంగులు, తామర్ల సుబ్బారావు, గూనపాటి అర్జున చేపల నాగరాజు పాతబోయిన శ్రీను, జన్ని అప్పలకొండ పాతబోయిన అర్జున, గోనపాటి సంతోష్ ఈశ్వరరావు సార లావణ్య, సారా సింహాద్రి అప్పుడు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



**జగ్గంపేట (కాకినాడ) జూన్ 30 (నేటి మనదేశమ్) :** నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన 22 మందికి టిడిపి కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. పేదవారికి వైద్యం కోసం ప్రభుత్వం అందించిన రూ.6,90,766 చెక్కులను ఆదివారం స్థానిక నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో అయన అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జీను మణిబాబు, వీరంరెడ్డి కాశి బాబు, రేఖ బుల్లిరాజు, పాండ్రంగి రాంబాబు, మండపాక అప్పన్న దొర, పీలా మహేష్, నండ్ల చిరంజీవి, పోతాబత్తుల శ్రీను, గల్లా శ్రీను, భవన పోసియ్యా , కరణం బోరయ్య, తదితరులు పాల్గొన్నారు.

### ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీని ప్రారంభించిన ఎంఎల్‌ఎ

**జగ్గంపేట (కాకినాడ) :** ఫిట్ ఇండియా కార్యక్రమంలో పోలీసులు చేపట్టిన ర్యాలీని స్థానిక ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రు ప్రారంభించారు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్ నుండి సిఐ బి.తిరుపతిరావు ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి ఎస్సై లు రఘునాథరావు,యు.వి శివ నాగబాబు, సతీష్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎరువుల యాప్‌తో రైతులకు తిప్పలు

గన్నవరం, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి) : ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఎరువుల యాప్ వల్ల వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతింటుందని రైతు సంఘం నాయకుడు బొమ్మారెడ్డి సుబ్బారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం గన్నవరం మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో అధికారులకు ఆయన ఒక వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త యాప్ విధానం వల్ల రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. సాంకేతిక సమస్యల వల్ల సకాలంలో ఎరువులు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. కాబట్టి తక్షణమే ఈ యాప్‌ను రద్దు చేసి, పాత పద్ధతిలోనే రైతులకు ఎరువులు పంపిణీ చేయాలని ఆయన అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సూరగాని సాంబశివరావు, ఆవుటపల్లి సాంబయ్య, కే. శ్రీమన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## కంభంపాటి వారి వివాహ రిసెప్షన్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు



ఎన్టీఆర్ జిల్లా, రెడ్డిగూడెం,జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి) : కంభంపాటి వారి వివాహ రిసెప్షన్ వేడుకల్లో మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు గారు పాల్గొన్నారు. జి.కొండూరు మండలం వెలగలేరు గ్రామంలో కంభంపాటి మౌనిక గారి వివాహ రిసెప్షన్ వేడుక బుజ్జిబాబు గారితో మంగళవారం నాడు జరిగింది. ఈ వివాహ రిసెప్షన్ వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు గారు నూతన వధూవరులను ఆశీర్వదించి వారికి వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ యార్లగడ్డ జోయ గారి భౌతికాయానికి నివాళు లర్పించిన మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు గారు....




అమరావతి,జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి) : సీపీఐ(ఎం) నందిగామ డివిజన్ నాయకురాలు, రాష్ట్ర రైతు సంఘం సభ్యురాలు కామ్రేడ్ యార్లగడ్డ జోయ గారి మృతికి మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు గారు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అమె మరణవార్త తెలుసుకుని అమరావతి ఐకాన్, బి-బ్లాక్-201లో ఉంచిన యార్లగడ్డ జోయ గారి పార్థీవ దేహాన్ని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు గారు మంగళవారం సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా జోయ గారు ప్రజా ఉద్యమాలు, రైతు సమస్యల పరిష్కారం కోసం చేసిన సేవలను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు గారు స్మరించుకున్నారు. ప్రజల కోసం అంకితభావంతో పనిచేసిన యార్లగడ్డ జోయ గారి మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని పేర్కొన్నారు.

## ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ధర్నా




పిఠాపురం జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి) : ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులను పీపీపీ విధానంలో ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పిఠాపురం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు విశ్వనాథం, జి. వీరబాబు, కె. చిన్న మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులు,ం సేవలు ప్రైవేటు చేతుల్లోకి వెళ్లే నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలు, నిర్వహణ, సిబ్బంది నియామకం పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలని కోరారు. ప్రైవేటీకరణ వల్ల ఆర్టీసీ ఆస్తులు, ఉద్యోగుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పప్పులు, ఎం. సూరిబాబు, ఎం. సత్తిబాబు, గోవిందు, సత్యనారాయణ, గోపాలకృష్ణ, కోనేటి రాజు, బి. అప్పన్నబాబు, డి. నాగేశ్వరరావు, వి. సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నూతన పోస్టల్ ఎస్పీగా శ్రీకర్ బాబు



అమలాపురం జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి) :అమలాపురంలో మంగళవారం, పీసీసీ సభ్యులు రుద్రరాజు గోపాలకృష్ణరాజు నూతన పోస్టల్ ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన శ్రీకర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. జిల్లాలోని పోస్టల్ కార్యాలయాలు ప్రగతి పథంలో నడవాలని ఆయన ఆకాంక్షించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 3వ స్థానంలో ఉన్న అమలాపురం పోస్టల్ ఎస్పీ కార్యాలయాన్ని, నూతన ఎస్పీ హయాంలో రాష్ట్రంలోనే మొదటి స్థానానికి తీసుకెళ్లాలని రుద్రరాజు కోరారు.

# ఆర్టీసీని అంగడి సరుకులా మార్చొద్దు..

– చంద్రబాబు ప్రైవేటీకరణ మోజుతో ప్రభుత్వ బాధ్యతను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నారు

– గన్నవరం ఎంపీపీ, వైఎస్సార్సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనగాని రవి



గన్నవరం, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి): రాష్ట్ర ప్రజలకు వెన్నెముకలా నిలిచిన ఆర్టీసీని ప్రైవేటీకరించే ప్రమాదకర నిర్ణయాలతో చంద్రబాబు ప్రభుత్వం ముందుకు వెళ్తోందని గన్నవరం ఎంపీపీ, వైఎస్సార్సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనగాని రవి ఆరోపించారు. "ప్రైవేటీకరణ అంటే ప్రభుత్వ బాధ్యతను ప్రైవేట్ కంపెనీలకు అప్పగించడమే. ఈరోజు ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణను ప్రైవేట్ కంపెనీలకు అప్పగిస్తున్నారు. రేపు లాభదాయక రూట్లను ఇస్తారు. ఎల్లుండి డిపోలు, వర్క్‌షాప్‌లు, ఇతర సేవలను కూడా ప్రైవేట్ చేతుల్లో పెడతారు. చివరకు ఆర్టీసీ పేరు మాత్రమే మిగులుతుంది. ఇదే ప్రైవేటీకరణ కాకపోతే మరేమిటి?" అని ప్రశ్నించారు. "ప్రభుత్వం ప్రజలకు సేవ చేయడానికి ఉందా? లేక ప్రైవేట్ కంపెనీలకు వ్యాపారం కల్పించడానికి ఉందా? ప్రభుత్వమే నడపాల్సిన ప్రజారవాణా వ్యవస్థను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం ద్వారా ప్రభుత్వం తన రాజ్యాంగబద్ధమైన బాధ్యత నుంచి తప్పుకుంటోంది. ఇది ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమైన నిర్ణయం" అని విమర్శించారు. జగన్ ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసి ఉద్యోగ భద్రత కల్పిస్తే, ఇప్పుడు అదే సంస్థను క్రమంగా బలహీనపరిచి ప్రైవేట్ కంపెనీలకు అవకాశాలు కల్పిస్తున్నారని ఆరోపించారు. "ఆర్టీసీకి అనుభవజ్ఞులైన డ్రైవర్లు, మెకానిక్లు, సాంకేతిక సిబ్బంది ఉన్నారు. వేలాది మంది ఉద్యోగులు ఉండగా ప్రైవేట్ కంపెనీల అవసరం ఏమిటి? ప్రభుత్వం బస్సులు కొనుగోలు చేసి, ఆర్టీసీ ఉద్యోగులతోనే నడిపిస్తే ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయి. కానీ కావాలనే ప్రైవేట్ కంపెనీలకు నిర్వహణ అప్పగించడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటో ప్రభుత్వం చెప్పాలి" అని డిమాండ్ చేశారు. "చంద్రబాబు గతంలో విద్యుత్, ప్రభుత్వ సేవలు, ఇతర రంగాల్లో ప్రైవేటీకరణకు ప్రాధాన్యం ఇచ్చినట్లే, ఇప్పుడు ఆర్టీసీపై కూడా అదే విధానాన్ని అమలు చేస్తున్నారని ప్రజలు భావిస్తున్నారు. ప్రజల ఆస్తులను, ప్రజల సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే ఆలోచనను వెంటనే విరమించుకోవాలి" అని అన్నారు. "ఆర్టీసీ అనేది కేవలం ఒక సంస్థ కాదు. రోజూ లక్షలాది మంది విద్యార్థులు, రైతులు, కార్మికులు, మహిళలు, వృద్ధులు ఆధారపడే ప్రజారవాణా వ్యవస్థ. అలాంటి సంస్థను లాభనష్టాల కోణంలో చూసి ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తే, భవిష్యత్తులో చార్జీల పెంపు, ఉద్యోగాల కోత, గ్రామీణ ప్రాంతాల్లో సేవల తగ్గుదల వంటి పరిణామాలు వచ్చే ప్రమాదం ఉందని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి" అని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, కొత్త బస్సులను ఆర్టీసీయే కొనుగోలు చేసి, ఆర్టీసీ ఉద్యోగులతోనే నడపాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేసి సంస్థను మరింత బలోపేతం చేయాలని అనగాని రవి డిమాండ్ చేశారు. "లేకపోతే కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం" అని హెచ్చరించారు.

# ప్రజాదర్బార్‌తో సమస్యలకు చకచకా పరిష్కారం

అధికారుల అలసత్వాన్ని ఉపేక్షించం...బాధ్యతతో పనిచేయాలి.

ప్రజాస్వామ్య పాలనకు ప్రతిబింబమే ప్రజాదర్బార్

-మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు



ఎన్టీఆర్ జిల్లా, రెడ్డిగూడెం,జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి) : ప్రజల వద్దకే పాలనను చేర్చి, వారి సమస్యలకు సత్వర పరిష్కారం చూపించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు గారు అన్నారు. రెడ్డిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన 'ప్రజాదర్బార్' పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సెల్ సిస్టమ్ (పి.జి.ఆర్.ఎస్.) కార్యక్రమంలో ఎమ్మెల్యే కృష్ణప్రసాదు గారు పాల్గొని ప్రజల నుంచి నేరుగా వినతిపత్రాలు స్వీకరించారు. ప్రతి వినతిని శ్రద్ధగా పరిశీలించిన ఎమ్మెల్యే కృష్ణప్రసాదు గారు సమస్యలను ఓపికగా విని సంబంధిత శాఖల అధికారులకు వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, అలసత్వం ప్రదర్శించే అధికారులను ఏమాత్రం ఉపేక్షించబోమని హెచ్చరించారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, సమస్యలను కేవలం నమోదు చేయడం కాకుండా వాటి మూలాలను గుర్తించి శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఒకవేళ ఏదైనా సమస్య వెంటనే పరిష్కారం కాకపోతే, దానికి గల కారణాలను సంబంధిత అధికారులు ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని అన్నారు. ప్రజాదర్బార్ ప్రజాస్వామ్య పాలనకు దర్పణంగా నిలుస్తోందని, ప్రజల సమస్యలను ప్రభుత్వం నేరుగా తెలుసుకుని వేగంగా స్పందించే సమర్థవంతమైన వేదిక ఇదేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యుత్, రహదారులు, తాగునీరు, సంక్షేమ పథకాలు తదితర శాఖలకు సంబంధించిన సమస్యలతో పాటు వ్యక్తిగత వినతులను సమర్పించారు. మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ) గారు, ఆయా శాఖల అధికారులు, కూటమి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


# వక్ఫ్ బోర్డు స్థలాలు అన్యాక్రాంతానికి అధికారులే కారణం

తప్పుడు సర్వే నెంబర్ లతో రిజిస్ట్రేషన్లు చేస్తున్న సబ్ రిజిస్ట్రార్ అధికారులు

మైనార్టీ ఆస్తుల అన్యకాంతానికి అధికారులే బాధ్యత వహించాలి....

కొండపల్లి 293 సర్వేనెంబర్ రిజిస్ట్రేషన్ అందుకు ఉదాహరణ...

ముస్లిం పర్సనల్ లా బోర్డు రాష్ట్ర అధ్యక్షులు అల్తాఫ్ బాబా



కొండపల్లి మున్సిపాలిటీ,జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి) : కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వందల ఎకరాల వక్ఫ్ బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం అవ్వడానికి కారణం వివిధ శాఖల అధికారులే అని, ముఖ్యంగా ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ అధికారుల ప్రధాన బాధ్యత ఉందని ఆరోపించారు ముస్లిం పర్సనల్ లా బోర్డు రాష్ట్ర అధ్యక్షులు అల్తాఫ్ బాబా. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీ ఆస్తులను అక్రమదారులకు సహకరిస్తున్న అధికారులు మైనార్టీ ద్రోహులుగా మిగిలి పోవడం తథ్యం అన్నారు కేవలం అధికారుల నిర్లక్ష్యం, ధన దాహం వలన మాత్రమే వలనే వక్ఫ్ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని ఆరోపించారు. స్థానిక రెవెన్యూ, ఇతర అధికారులు కూడా తమ వంతు పాత్ర పోషిస్తున్నారని, డబ్బుల కోసం ఎన్వోసీ లు, పన్నులు సృష్టించి అక్రమార్కులకు సహకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటి ఆధారాలతో అసలు సర్వే నెంబర్ వదిలేసి, తప్పుడు సర్వే నెంబర్లతో సబ్ రిజిస్టర్ కార్యాలయం అధికారులు రిజిస్ట్రేషన్ చేసి మొత్తం వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని మండిపడ్డారు. కొండపల్లి మున్సిపాలిటీలోని వక్ఫ్ బోర్డ్ భూములు సర్వే నెంబర్ లు మార్చి రిజిస్ట్రేషన్లు చేసిన దాఖలాలు వందలు సంఖ్యలో పత్రాలు ఉన్నాయని,కొండపల్లి హాజరత్ ముర్తుజా అలీ పంజా సర్వే నెంబర్ 293 పీర్ల పంజా ను 2009లో తప్పుడు రిజిస్ట్రేషన్ చేశారని, వక్ఫ్ బోర్డ్ అధికారులు ఫిర్యాదుతో రెవెన్యూ వారు డాక్యుమెంట్ పరిశీలించగా ఎక్కడో సర్వే నెంబర్ పెట్టి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని అది చల్లదని అధికారులు నోటీస్ ఇచ్చి తదుపరి కోర్టులో కేసు నడుస్తుండగా చాలా తెలివిగా గ్రామ కంఠం సాగు చూపించి రెండు నెలల కిందట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని, మదర్ డాక్యుమెంట్ తప్పు ఉన్నప్పుడు రిజిస్ట్రేషన్ ఎలా చేస్తారు రిజిస్టర్ పై ఉన్నత అధికారులు చర్యలు తీసుకోకపోతే న్యాయం కోసం న్యాయపోరాటం తప్పదని హెచ్చరించారు. వక్ఫ్ బోర్డ్ ఆస్తులలో పన్నులు వేయడానికి, ఎన్ ఓ సి లు ఇవ్వడానికి, తప్పుడు రిజిస్ట్రేషన్ చేయటం కోసమే ఉద్యోగంలోకి చేరారా..?డాక్యుమెంట్ రైటర్ అరాచకాలు రోజురోజుకు మితిమీరి పోతూ మైనార్టీ ఆస్తులు ఇష్టానుసారంగా తప్పుడు రిజిస్ట్రేషన్ చేస్తే మైనార్టీలు ఎవరు ప్రశ్నించరు అనే ధీమాతో ఉన్నారా?ఇది తప్పు అని నిలదీస్తే తప్పుడు ప్రచారాలు మత కలహాలు దుష్ప్రచారం చేయటం అత్యంత బాధాకరం. బిఅధికారులకు ఖబర్దార్ వక్ఫ్ బోర్డ్ ఆస్తులు జోలికి వస్తే ఉన్నత న్యాయస్థానం హైకోర్టు సుప్రీంకోర్టు వరకు న్యాయం కోసం పోరాటం చేసి తప్పు చేసిన అధికారులను కోర్టులో దోషిగా నిలబెడతాం అని అన్నారు. అమాయక ప్రజల్లారా దయచేసి మోసపోకండి వక్ఫ్ బోర్డు ఆస్తులలో ఎవరైనా కొనుగోలు చేస్తే వారు ఇబ్బంది పడటం ఖాయం ఆ మహనీయుల ఆస్తులు కాపాడుకోవడానికి తుది శ్వాస వరకు పోరాటం చేస్తాం. కొండపల్లి లో పంజాలు దర్గాలు స్మశాన వాటికలు ఖాజీమాన్యాలు ఎవరైనా ఆక్రమించి కొనుగోలు చేసి ఉంటే తస్మాత్ జాగ్రత్త ఎవరిని వదిలే ప్రసక్తే లేదు న్యాయపోరాటం చేస్తాం ఆ మహనీయుల ఆస్తులు కాపాడుకుంటాం ఎవరికీ భయపడే ప్రసక్తే లేదని. అల్తాఫ్ అలీ రజా తెలిపారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ




ఎర్రగొండపాలెం జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి) : మార్కాపురం జిల్లా ఎర్రగొండపాలెం టిడిపి కార్యాలయంలో మంగళవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ జరిగింది. వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ, చికిత్స కోసం సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకున్న 29 మందికి రూ. 36.90 లక్షల విలువైన చెక్కులను ఇన్ ఛార్జ్ గూడూరి ఎరీక్షన్ బాబు అందించారు. పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని సీఎం చంద్రబాబు అడిగిన వెంటనే సీఎం రిలీఫ్ ఫండ్ విడుదల చేస్తున్నారని ఆయన తెలిపారు.

## రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

గన్నవరం, జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి) : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర 23వ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ గన్నవరం రైతు సంఘం నాయకులు బుధవారం గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి సూరగాని సాంబశివరావు మాట్లాడుతూ జూలై 3, 4, 5 తేదీలలో ఏలూరు నగరంలో ఈ రాష్ట్ర మహాసభలు అత్యంత వైభవంగా జరగనున్నాయని తెలిపారు. అందులో భాగంగా జూలై 3వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు జూట్ మిల్ సెంటర్ నుండి భారీ 'రైతు, ప్రజా ప్రదర్శన' ప్రారంభమవుతుందని, అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్ గ్రౌండ్ వద్ద బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ బహిరంగ సభకు ముఖ్య వక్తలుగా ఏ.ఐ.కె.ఎస్ ప్రధాన కార్యదర్శి విజూకృష్ణన్, ఏ.ఐ.కె.ఎస్ అధ్యక్షులు అశోక్ ధావలే, ఎస్.కె.ఎం రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె. ప్రభాకరరెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.బలరాం తదితరులు హాజరై ప్రసంగిస్తారని అన్నారు. "వ్యవసాయాన్ని కాపాడుకుందాం - రైతును రక్షించుకుందాం" అనే నినాదంతో సాగుతున్న ఈ మహాసభలకు, బహిరంగ సభకు గన్నవరం నియోజకవర్గ పరిధిలోని రైతులు, కౌలు రైతులు, ప్రజాస్వామ్యవాదులు అందరూ పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కె. శ్రీమన్నారాయణ, బొమ్మారెడ్డి సుబ్బారెడ్డి, ఆవుటపల్లి సాంబయ్య, మిరప నాగేశ్వరావు, రైతు వాణి ఎడిటర్ ఉడతా రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## విభిన్న ప్రతిభావంతులకు అండగా మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు

ఎలక్ట్రిక్ త్రీ వీలర్ల పంపిణీ.



ఎన్టీఆర్ జిల్లా, రెడ్డిగూడెం,జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి) : రెడ్డిగూడెంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజాదర్బారు కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులకు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు గారు మంగళవారం ఎలక్ట్రిక్ త్రీ వీలర్లను పంపిణీ చేశారు. ఒడ్డిగూడెం మండలంలోని కూనపరాజుపర్వ గ్రామానికి చెందిన కందుల లక్ష్మి గారికి, రెడ్డిగూడెంకు చెందిన పెదగమల్ల వెంకయ్య గారికి ఎలక్ట్రిక్ త్రీ వీలర్లను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు గారు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు గారు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు సమాజంలో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందన్నారు. సంక్షేమ పథకాల ఫలాలు నిజమైన అర్హులకు చేరేలా కూటమి ప్రభుత్వం పారదర్శకంగా చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. తమ అవసరాన్ని గుర్తించి ఎలక్ట్రిక్ త్రీ వీలర్లను అందజేసిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు గారికి లబ్ధిదారులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## పాదగయలో హుండీ లెక్కింపు కార్యక్రమం



పిఠాపురం జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి) : ఉమా కుక్కుటేశ్వర స్వామి వారి దేవస్థానం(పాదగయ) వారి హుండీ లెక్కింపు కార్యక్రమం కాకినాడ జిల్లా తనిఖీదారు వడ్డీ ఫణీంద్ర కుమార్ మరియు కార్యనిర్వహణాధికారులు కర్రి సోమరాజు, వరిపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఆలయ సహాయ కమీషనరు, కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ఏసీ అండ్ ఈవో మాట్లాడుతూ ది. 31. 03. 2026 నుండి ది. 30. 06. 2026 వరకు 92 రోజులకుగాను ఆలయ హుండీల ద్వారా 19, 29, 139/- రూపాయిలు మరియు అన్నదానం హుండీ ద్వారా 1, 11, 767/- వెరసి రూ. 20, 40, 906/-లు ఆదాయం వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్త బృందం, బ్యాంకు సిబ్బంది, పోలీసు సిబ్బంది, రెవిన్యూ సిబ్బంది, అర్చకులు, పాత్రికేయులు, తదితరులు పాల్గొన్నారు.

## వరాహ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో ఎమ్మెల్యే



కొండేపి జూన్ 30 (నేటి మనదేశమ్ ప్రతినిధి) : కొండేపి ప్రకాశం జిల్లా సింగరాయకొండలోని శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో మంగళవారం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు పాల్గొన్నారు. ఆయన కుటుంబ సమేతంగా స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి, పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సత్కరించారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No: 1-3/21-16, Kamakotinagar, Vidyadharapuram, Vijayawada-520 012. (A.P.) and
Printed at SKYLINE PRESS, D.No: 1-3/21-16, Kamakotinagar, Vidyadharapuram, Vijayawada-520 012. (A.P.), Associate Editor : K. Neeraja, Ph: 0866-2411299. E-mail: netimanadesam.vja@gmail.com